

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 13-08-2025 | సంపుటి - 24 | సంచిక - 98 | రూ : 4 | పేజీలు: 8


## ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో పని చేస్తోంది

- హ్యామ్ 'రోడ్ షో'లో ఉప ముఖ్యమంతి భట్టి విక్రమార్క

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతోపాటు తెలంగాణ రైజింగ్‌లో భాగంగా మౌలిక సదుపాయాలు, సేవలు, పరిశ్రమలు, విద్య, వైద్యం తదితర రంగాల్లో స్పష్టమైన లక్ష్యంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశానికి ఆదర్శంగా హ్యామ్ రోడ్లను నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని న్యాక్ కార్యాలయంలో హ్యామ్ రహదారులపై 'రోడ్ షో' కార్యక్రమాన్ని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు.

తరువాయి 2లో




## దంచికొట్టె.. దడపుట్టించె..



- భారీ వర్షాలతో వరంగల్, నల్గొండ జిల్లాలు అతలాకుతలం
- ఇద్దరి మృతి.. ఒకరు గల్లంతు
- సంగెం మండలంలో అత్యధికంగా 21.8 సెం.మీ.
- మరో మూడు రోజులపాటు రెడ్ ఎలర్ట్
- బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం
- 5 జిల్లాల్లో రెండు రోజులు పాఠశాలలకు సెలవులు
- జీహెచ్ఎంసీ పరిధిలో ఒంటిపూట బడులు

హైదరాబాద్, సూర్యాపేట, వరంగల్: రాష్ట్రంలోని పలు జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధం కావడంతో జనజీవనానికి ఆటంకం కలిగింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు చాలా జిల్లాల్లో 10 సెంటీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వరంగల్ జిల్లా సంగెం మండలంలో 21.8 సెం.మీ. నమోదైంది. 12 ప్రాంతాల్లో 10.7 సెం.మీ.కి పైగా కురిసింది. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా.. మూడున్నర గంటల

తరువాయి 2లో

## సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్..

**దేశ సగటు కంటే 10 రెట్లు ఎక్కువ!**

- సైబర్ నేరాల్లో దేశంలోనే తెలంగాణకు అగ్రస్థానం
- జాతీయ సగటు కంటే పది రెట్లు అధికంగా క్రైమ్ రేటు
- వెల్లడించిన జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ)
- జాబితాలో రెండో స్థానంలో నిలిచిన మరో దక్షిణాది రాష్ట్రం కర్ణాటక
- ఏపీలో 4.4 శాతంగా నమోదైన సైబర్ క్రైమ్ రేటు
- నేరాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు

2లో





2లో

### అమరావతి పనులు రికార్డు

## సమయంలో పూర్తి కావాలి

- అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్ష
- మొత్తం రూ. 81,317 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ ప్రతిపాదన
- ఇప్పటికే రూ. 50,552 కోట్ల పనులకు టెండర్లు పూర్తి
- సమీక్షకు హాజరైన మంత్రి నారాయణ, ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లు
- భవనాలు, రోడ్లు, వరద నియంత్రణ పనులపై చర్చ

## రెడ్ అలర్ట్...

**తెలంగాణలో పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు**

- మూడు రోజుల పాటు భారీ వర్షాలు
- హన్మకొండ, జనగాం, వరంగల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

2లో



### గుజరాత్ లోని రిలయన్స్ రిఫైనరీని

## టార్గెట్ చేస్తాం



**అసిమ్ మునీర్ హెచ్చరిక**

5లో

### తిరుమల వెళ్లే భక్తుల వాహనాలకు

## 'ఫాస్టాగ్' లేకపోతే నో ఎంట్రీ



**ఆగస్టు 15 నుంచి కొత్త నిబంధన అమలులోకి**

2లో

# సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్...




**హైదరాబాద్:** సైబర్ నేరాల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధికంగా అప్రతిష్ఠను మూట గట్టుకుంది. దేశవ్యాప్తంగా నమోద వుతున్న సైబర్ క్రైమ్ రేటుతో పోలిస్తే తెలంగాణలో దాదాపు 10 రెట్లు అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ షాకింగ్ విషయాలను జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) మంగళవారం విడుదల చేసిన 2022 మధ్యంతర డేటా వెల్లడించింది.ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేటు సగటున 4.8 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది 40.3 శాతంగా నమోదైంది. దీంతో ఈ జాబితాలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే సైబర్ నేరగాళ్లు ఎక్కువగా క్రియాశీలంగా ఉన్నట్లు ఈ నివేదిక సూచిస్తోంది. తెలంగాణ తర్వాత కర్ణాటక రెండో స్థానంలో ఉంది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, మహారాష్ట్రలో సైబర్ క్రైమ్ రేటు 6.6 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 4.4, అస్సోంలో 4.9, ఉత్తరప్రదేశ్, ఒడిశాలలో 4.3 శాతం చొప్పున ఉంది. పెద్ద రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కేవలం 0.4 శాతం క్రైమ్ రేటుతో మెరుగైన స్థానంలో నిలవడం గమనార్హం. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢిల్లీ 3.2 శాతం, పుదుచ్చేరి 3.9 శాతం క్రైమ్ రేటుతో సైబర్ నేరాలకు హాట్‌స్పాట్‌లుగా మారాయి. ఢిల్లీ పోలీసుల డేటా ప్రకారం, 2024లో సైబర్ మోసాల ద్వారా ఢిల్లీ వాసులు రూ. 817 కోట్లు నష్టపోయారు. 2025లో జూన్ 30 నాటికి మొదటి ఆరు నెలల్లోనే రూ. 70.64 కోట్లు కోల్పోయారు. దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల లోక్‌సభకు తెలిపారు. ఇందులో భాగంగా 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' (I4C) ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' (cyber crime.gov.in) ప్రారంభించామని వివరించారు. దీంతో పాటు, మహిళలు, చిన్నారులపై జరిగే సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు పోలీస్ విభాగాల్లో ప్రత్యేక యూనిట్లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# అమరావతి పనులు రికార్డు సమయంలో పూర్తి కావాలి




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను రికార్డు సమయంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై మంగళవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. రాజధాని నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని, పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు సీఆర్డీఏ, ఏడీసీకి చెందిన ఉన్నతాధికారులు, నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు హాజరయ్యారు. రాజధాని నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లు, పనుల ప్రస్తుత దశపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. అమరావతిలో చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. రాజధానిలో మొత్తం రూ. 81,317 కోట్ల విలువైన పనులను చేపట్టాలని సీఆర్డీఏ ప్రతిపాదించగా, ఇప్పటివరకు రూ. 50,552 కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ప్రధానంగా భవన నిర్మాణాలు, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్పీఎస్) పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రధాన రహదారులు, డక్టుల వంటి ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులతో పాటు వరద నియంత్రణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు పనుల్లో వేగం పెంచి, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## రెడ్ అలర్ట్... తెలంగాణలో పలు జిల్లాల్లో

# భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. హన్మకొండ, జనగాం, మహబూబాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ తదితర జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. బుధ, గురువారాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ములుగు, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రేపు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# తిరుమల వెళ్లే భక్తుల వాహనాలకు 'ఫాస్టాగ్' లేకపోతే నో ఎంట్రీ

- **భద్రత, రద్దీ నియంత్రణ కోసమే ఈ నిర్ణయమన్న టీటీడీ**
- **ఫాస్టాగ్ లేని వాహనాలకు కొండపైకి అనుమతి నిరాకరణ**
- **భక్తులు సహకరించాలని టీటీడీ చైర్మన్ విజ్ఞప్తి**

**తిరుమల:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక ముఖ్యమైన సూచన చేసింది. ఇకపై తిరుమలకు వెళ్లే అన్ని రకాల వాహనాలకు ఫాస్టాగ్ ను తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధన స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం స్పష్టం చేశారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాల రద్దీని నియంత్రించడం, భక్తులకు మెరుగైన భద్రతా ప్రమాణాలు కల్పించడం, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ లేని వాహనాలను తిరుమల ఘాట్ రోడ్డుపైకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన తేల్చిచెప్పారు. భక్తుల సౌకర్యార్థం, ఫాస్టాగ్ లేని వాహనదారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ తెలిపింది. అలిపిరి టోల్ ప్లాజా వద్ద ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో ఒక ప్రత్యేక ఫాస్టాగ్ జారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫాస్టాగ్ లేని వారు ఈ కేంద్రంలో తక్కువ సమయంలోనే దాన్ని పొంది, ఆ తర్వాతే తమ వాహనాల్లో తిరుమలకు ప్రయాణించవచ్చని వివరించారు.

# ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో పని చేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం నిర్వహించిన సమావేశంలో భట్టి మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపడితేనే పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తారన్నారు. ఈ లక్ష్యంతోనే రాష్ట్రవ్యాప్తంగా 7,947 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు, 5,190 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్లను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర రహదారులను హ్యామ్ విధానంలో నిర్మించడం ద్వారా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టామన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. హ్యామ్ రోడ్ల నిర్మాణం పూర్తయితే మారుమూల గూడేలు, తండాలకు రహదారి సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ రామకృష్ణారావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ముఖ్య కార్యదర్శులు శ్రీధర్, సందీప్‌కుమార్ సుల్తానియా, గుత్తేదారులు, కన్సల్టెన్సీ సంస్థలు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి పనులు చేశామని, అప్పుల పాలవుతున్నామని పలువురు గుత్తేదారులు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తంచేయగా.. ఎస్ఎల్‌బీసీ ప్రతినిధులు స్పందించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణానికి తమ సహకారం ఉంటుందని వెల్లడించారు.

*** కాలుష్య కారక పరిశ్రమలను తరలించాలి : భట్టి**

కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని భట్టి అధికారులను ఆదేశించారు.



# దంచికొట్టి.. దడపుట్టించి..

(మొదటిపేజీ తరువాయి)



పాటు కుండపోత వర్షంతో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 40 కాలనీలు జలమయమయ్యాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 73 మండలాల్లో వర్షం కురవగా.. సూర్యాపేట జిల్లా నాగారంలో 19 సెం.మీ వర్షపాతం నమోదైంది. వాగులు పొంగిపొర్లడంతో పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. రానున్న మూడు రోజుల (72 గంటలు) పాటు పలు జిల్లాల్లో భారీ, అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ 'రెడ్' ఎలర్ట్ ప్రకటించింది. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడనున్న అల్పపీడనం శుక్రవారం నాటికి మరింత బలపడనున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. ఈ ప్రభావంతో బుధవారం యాదాద్రి భువనగిరి, జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు, గురువారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు 'రెడ్' ఎలర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాల్లో ఒక్కో చోట అతి నుంచి అత్యంత భారీ వర్షాలు.. కుంభవృష్టి కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ శాస్త్రవేత్తలు హెచ్చరికలు జారీ చేశారు. 20 సెంటీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదవుతుందని సూచించారు. రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఇక్కడ అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ జిల్లాల్లో 11.5 సెం.మీ.కి పైగా వర్షపాతం నమోదు కానుంది. మిగిలిన జిల్లాలకు ఎల్లో రంగు హెచ్చరికలు జారీ చేయగా కొన్ని ప్రాంతాల్లో 10 సెం.మీ. లోపు వర్షం కురుస్తుందని పేర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోనూ అతి భారీ వర్షాలు కురవనున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో అప్రమత్తత ప్రకటించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ శాఖ డైరెక్టర్ నాగరత్న ఒక ప్రకటనలో సూచించారు. భారీ వర్షాలకు తోడు ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు (గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో) వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కర్ణాటక రాష్ట్ర పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఒకటి కొనసాగుతున్నట్లు ఐఎండీ పేర్కొంది.

**వరద నీట మునిగి..**

భారీ వర్షాల కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు గ్రామాల్లో చెరువు, కుంటలు పొంగి పొర్లాయి. కాలనీల రహదారులు, మురుగు కాలువలు చెరువులను తలపించాయి. వరంగల్ తూర్పు నియోజకవర్గం కరీమాబాద్ కాశీకుంటలోని వాంబే కాలనీలో ఇంట్లోకి వరదనీరు చొచ్చుకురావడంతో మంచంపై కదలలేని స్థితిలో ఉన్న పసునూటి బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఊపిరాడక మృతి చెందింది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని యూసుఫ్‌పూర్‌లో నీట మునిగిన పిట్టవాగు లోలెవెల్ వంతెన దాటుతూ మ్యాతరి శ్రీనివాస్ (35) ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించాడు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామంలో ఆకేరు వాగు దాటబోయి.. ఉప్పలయ్య (65) అనే పశువుల కాపరి గల్లంతయ్యాడు. మంగళవారం తెల్లవారుజామున వరంగల్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంను తాకుతూ వరదనీరు ప్రవహించడంతో గంటన్నర పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరంగల్ నగర పరిధిలో ఐదారు గంటల పాటు ప్రజారవాణా స్తంభించింది. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం, నూతనకల్, అడ్డగూడూరు, మోత్కూరు తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. తుంగతుర్తి మండలంలో సంగెంవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో నూతనకల్, జాజిరెడ్డిగూడెం మండలాల మధ్య ప్రయాణాలు నిలిచిపోయాయి. తూర్పుగూడెంలోని ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరింది. వందలాది ఎకరాల్లో వరిపొలాలు నీటమునిగాయి. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని కేజీబీవీని మరోసారి వరద చుట్టుముట్టింది. తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని తమ పిల్లలను ట్రాక్టర్‌లోకి ఎక్కించి ఇళ్లకు తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో ఈసీ నది ఉరకలెత్తి రహదారిని ముంచెత్తింది. హిమాయత్‌సాగర్ జలాశయంలో ఒకేసారి 5 క్రస్టుగేట్‌లను 3 అడుగుల మేర ఎత్తి 4,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో ఉప్పొంగి ప్రవహించింది. దీంతో దర్గాఖలీజ్‌ఖాన్ సమీపంలోని ఔటర్‌రింగు రోడ్డుకు చెందిన సర్వీసుమార్గంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది.

# హైదరాబాద్ వరద కష్టాలకు చెక్.. రోడ్ల కింద భూగర్భ సంపుల నిర్మాణం

- **హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు కారణమవుతున్న వరద నివారణకు కొత్త ప్రయోగం**
- **రోడ్ల కింద భారీ భూగర్భ నీటి సంపుల నిర్మాణం చేపట్టిన ప్రభుత్వం**
- **వరద నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు చర్యలు**
- **మొదటి దశలో రూ.13.99 కోట్లతో 11 చోట్ల సంపుల నిర్మాణం పూర్తి**
- **సచివాలయం, కేసీపీ జంక్షన్ వంటి ప్రాంతాల్లో విజయవంతమైన ప్రయోగం**
- **మరిన్ని ప్రాంతాల్లో సంపుల నిర్మాణానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు**

హైదరాబాద్‌లో వర్షాకాలం వచ్చిందంటే చాలు నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పవు. చిన్నపాటి వానకే రహదారులు చెరువులను తలపించడం, గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడం సర్వసాధారణం. ఈ తీవ్రమైన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. రోడ్ల కింద భారీ భూగర్భ నీటి సంపులను (రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్) నిర్మిస్తూ ఒకే దెబ్బకు రెండు ప్రయోజనాలను సాధిస్తోంది. ఈ భూగర్భ సంపుల నిర్మాణం ద్వారా ప్రభుత్వం బహుళ ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుంది. వర్షం పడినప్పుడు రోడ్లపై నిలిచే నీరంతా నేరుగా ఈ సంపులలోకి చేరుతుంది. దీంతో రోడ్లపై నీరు నిలవకుండా ట్రాఫిక్ సాఫీగా సాగిపోతుంది. అదే సమయంలో సంపులలో చేరిన నీటిని ప్రత్యేక ఇంజక్షన్ బోర్ల ద్వారా భూమిలోకి ఇంకేలా చేస్తున్నారు. దీనివల్ల భూగర్భ జలమట్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ విధంగా, ఒకే నిర్మాణంతో తక్షణ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం, దీర్ఘకాలికంగా పర్యావరణానికి మేలు జరుగుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నగరంలో తరచూ నీరు నిలిచే ప్రాంతాలను జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించారు. మొత్తం 144 ప్రాంతాల్లో వరద సమస్య ఉన్నట్టు తేల్చగా, వాటిలో 50 చోట్ల పరిస్థితి తీవ్రంగా ఉంది. సమీపంలో నాలాలు, చెరువులు ఉన్నచోట నీటిని అటువైపు మళ్లిస్తుండగా, ఆ సౌకర్యం లేని చోట్ల ఈ భూగర్భ సంపులను నిర్మిస్తున్నారు.మొదటి విడతలో భాగంగా 23 ప్రాంతాలను ఎంపిక చేయగా, రూ.13.99 కోట్ల వ్యయంతో 11 చోట్ల పనులు ప్రారంభించారు. వీటిలో 10 నిర్మాణాలు ఇప్పటికే పూర్తి కాగా, మరొకటి తుది దశలో ఉంది. మిగిలిన 12 ప్రదేశాల్లో భూగర్భంలో కేబుళ్లు, పైపులైన్లు ఉండటంతో నిర్మాణం సాధ్యపడలేదు. అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి 15 నుంచి 20 అడుగుల లోతుతో, 2.65 లక్షల నుంచి 10.4 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఈ సంపులను నిర్మిస్తున్నారు. ఈ ప్రయోగం ఇప్పటికే పలు కీలక ప్రాంతాల్లో సత్ఫలితాలనిస్తోంది. గతంలో వర్షం పడినప్పుడల్లా సచివాలయం ఎదుట, సోమాజిగూడ కేసీపీ జంక్షన్ వద్ద, రాజ్‌భవన్ సమీపంలో, పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 264 వద్ద రెండు, మూడు అడుగుల మేర నీరు నిలిచి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు ఈ ప్రాంతాల్లో భూగర్భ సంపుల నిర్మాణంతో ఆ సమస్య దాదాపుగా పరిష్కారమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మరిన్ని అనువైన ప్రాంతాలను గుర్తించి సంపుల నిర్మాణం చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్

# మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరము లో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించా రు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం, నియంత్రణ చర్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ విని యోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని అమలుచేయాలని సూ చించారు. జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలనీ సూచించారు. డీ అడిక్షన్ సెంటర్ ద్వారా అవసర మైన వారికి చికిత్స అందించాలన్నారు. అటవీశాఖ అధికారులు వారి పరిధిలోని అటవీభూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు



సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని కలెక్టర్ డ్రగ్ ఇన్స్పెక్టర్‌కు సూచించారు. ఇంటర్ కళాశాలలో మాదక ద్రవ్యలు వినియోగం వల్ల జరిగే నష్టాలు పట్ల అవగాహన కల్పించడానికి ఈ వారం లో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలకు వ్యతి రేకంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు, యువతకు, ప్రజలకు, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యువత గంజాయి డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటిదశలోనే కట్టడి చేయాలని, కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల అలవాట్లను, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ఈ సమావేశం లో జడ్ పి సి ఈ ఓ నాగలక్ష్మి, ఇంటర్మీడిట్ అధికారి వేంకటేశ్వరరావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సంబంధిత శాఖల అధికారుల తదితరులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి

**- బూరుగు కృష్ణారెడ్డి**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సిపిఎం మండల, మున్సిపల్ కమిటీల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. బీహార్ రాష్ట్ర ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్ గా మారి, బిజెపికి ఓట్లు పడని ప్రాంతాలలో ఏదో ఒక పేరుతోటి ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామం ప్రజాస్వామ్యం వ్యతిరేకమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, గంగాదేవి సైదులు, రాగీరు కృష్ణయ్య, గోశిక కరుణాకర్, నాయకులు బొడ్డు అంజిరెడ్డి, బోయ యాదయ్య, తూర్పునూరి మల్లేశం, కొండె శ్రీశైలం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అడిగినంత డబ్బులు ఇవ్వలేదని షాపుల వద్ద చెత్త వదిలేసిన పారిశుద్ధ్య సిబ్బంది

జీడిమెట్ల. (ప్రజాస్ఫూర్తి): కుత్బుల్లాపూర్ - సుచిత్ర ప్రధాన రహదారి గోదావరి హోమ్స్ సమీపంలోని షాపుల వద్ద పారిశుద్ధ్య సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన ఘటన స్థానికుల్లో ఆగ్రహం రేపుతోంది. సాధారణంగా సేకరించాల్సిన చెత్తను, "మీరు అడిగినంత డబ్బులు ఇవ్వలేదని కారణం చూపుతూ, రోడ్డుపైన ఉన్న చెత్త, గుడ్డముక్కలను సంచిలో నింపుకొని షాపుల ముందు



వదిలేసినట్లు సీసీ కెమెరాల్లో ప్రత్యక్ష రికార్డయింది. ఈ విషయాన్ని స్థానికులు కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోని జవాన్‌కు తెలపగా, ఆయన వెంటనే వచ్చి సమస్య పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అయితే, కొద్దిసేపటికే తిరిగి వచ్చిన ఆ సిబ్బంది, "మీరు ఎవరికి చెప్పినా చెప్పండి... నేను చెత్త తీసుకెళ్ళను" అంటూ దురుసుగా సమాధానం ఇచ్చి వెళ్లిపోయారు. వర్షాకాలం, వ్యాధుల సీజన్‌లో ఇలాంటి నిర్లక్ష్య వైఖరి ప్రజారోగ్యానికి ప్రమాదకరమని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి ఇల్లందు: ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్న ప్రజశేయస్సే ముఖ్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం 59 లబ్ధిధారులకు గాను 19లక్షల రుపాయల చెక్కులు ఎమ్మెల్యే చే పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం, రాబోయే రోజులలో జరిగే ఎన్నికలలో మంచి చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాము, మాజీ మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, టౌన్ నాయకులు మాడుగుల సాంబమూర్తి, టౌన్, మండల పార్టీ అధ్యక్షులు దొడ్డా డానియల్, పులి సైదులు, నాయకులు బోళ్ళ సూర్యం, గందె సదానందం, తాటి భిక్షం, మూతి క్రిష్ణ, ప్రసన్న కూమార్, క్రిష్ణప్రసాద్, ఈసం లక్ష్మణ్, బండి ఆనంద్, దండుగుల శీవ, కల్తి పద్మ, పాయం స్వాతి, సుదర్శన్ కోరి తదితరులు పాల్గోన్నారు.

## వేతనాల పెంపులో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకోవాలి

*** సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కనీస వేత నాల సవరిస్తూ 2021 లో విడుదల చేసిన ఐదు ప్రిలిమినరీ ప్రభుత్వ ఉత్తర్వులను యధాతథంగా గెజిట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ కోరారు. మంగళవారం సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్మిక శాఖధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ మాట్లాడుతూ. కనీస వేతనాలు పై వేసిన సబ్ కమిటీ కి స్వస్తి చెప్పాలని వేతనాల పెంపులో సుప్రీంకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 68వ షెడ్యూలు పరిశ్రమ జీవోలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు . ఇప్పటికే కనీస వేతనాల సలహా మండలి ప్రతిపాదనలు పక్కనపెట్టి క్యాబినెట్ సబ్ కమిటీ చేస్తున్న కాలయాపనకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారూ. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం పది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ,నాలుగు సార్లు వేతన సవరణ చేసినప్పటికీ అట్టి సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. 2021 లో 5 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ల ఉత్తర్వులు టిఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిందని, ఆ తర్వాత కార్పొరేట్ మేనేజ్మెంట్ల ఒత్తిడితో ఆ జీవోలను అమలు చేయలేదన్నారు. గెజిట్ చేయకపోవడం వల్ల జారీ చేసిన జీవోలను బుట్టదాఖలు చేసి కార్మిక వర్గాన్ని నష్ట దాయకం చేస్తున్నటువంటి పద్ధతికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటం చేయాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం 73వ షెడ్యూల్ పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ ,హమాలీ, స్వచ్ఛమిత్ర, షాపు ఎంప్లాయిస్, పెట్రోల్ బంకు కార్మికులు తదితర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



## ప్రజలకు ఇచ్చిన ప్రతి హామిని నేరవేర్చుకుంటూ వస్తున్నాం

**: ఎమ్మెల్యే కనకయ్య**

ప్రజాస్ఫూర్తి ఇల్లందు: ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చినట్లు ప్రతి హమి నిరవేర్చుకుంటూ వస్తున్నామని ఎమ్మెల్యే కనకయ్య అన్నారు.మంగళవారం కామేపల్లి మండలంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ముచ్చర్ల లక్ష్మి పంక్షన్ హల్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎంఆర్ఎఫ్,నూతన రేషన్ కార్డులను ఆయన ముఖ్య అతిధి గా హజరై లబ్ధిదారులకు పంపిణి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 66 మంది లబ్ధిదారులకు 17,30000 వేల సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి చేయగా 1412మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చే నూతన రేషన్ కార్డుల పంపిణి చేసినట్లు తెలిపారు. గత పదేళ్ళ కాలంలో రేషన్ కార్డులు ఇవ్వకపోగా,ప్రజలను మోసం చేసారన్నారు. నేడు ఇందిరమ్మ రాజ్యంలో రేషన్ కార్డుల పంపిణి పండుగలా జరుపుతున్నామన్నారు. రాష్టం ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్న ప్రజా శ్రేయస్సే పరమావధిగా సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు , కామేపల్లి మండల పార్టీ అధ్యక్షులు గింజల నర్సి రెడ్డి,నాయకులు మేకల మల్లిబాబు యాదవ్,సొసైటి చైర్మెన్ ధనియాకుల హనమంతరావు,మార్కెట్ కమిటి డైరెక్టర్ మాళోత్ బావుసింగ్,ఆత్మ కమిటి డైరెక్టర్ దమ్మాల పాటి సత్యనారయణ, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.




## క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జీడిమెట్ల ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ అన్నారు వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్లో మంగళవారం ఇన్వెస్ట్ చర్(పదవి స్వీకరణ) వేడుక ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ పాఠశాల కరస్పాండెంట్ ఎం సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన స్కూల్ హెడ్ బాయ్ గా నిఖిల్, హెడ్ గర్ల్ గా మధు వర్షిని బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కరెస్పాండెంట్ యం.సునీత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లలు మానసిక అభివృద్ధి దోహదపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్,పి. లత అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు







## సీఐఈ గాంధీనగర్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ చైర్మన్ కి కార్పొరేటర్ శుభాకాంక్షలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : సీఐఈ గాంధీనగర్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ కి చైర్మన్ గా ఎన్నికైనటువంటి పి. స్వామి గౌడ్ ని మంగళవారం రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బీ.విజయ్ శేఖర్ గౌడ్ ఆయను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు కార్తీక్ గౌడ్, బాలు నేత, సతీష్ గటోజి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షున్ని కలిసిన మున్సిపల్ ప్రధాన నాయకులు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును ఆయన నివాసంలో ఆ పార్టీకి చౌటుప్పల్ మున్సిపల్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. హౌస్ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని సమస్యలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బుడ్డ సురేష్ కుమార్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు ఊడుగు వెంకటేశం ఉపాధ్యక్షులు నల్ల శివప్రసాద్ ,గుండెబోయిన వేణు యాదవ్, బూత్ అధ్యక్షులు కానుగు శేఖర్, సత్తి రెడ్డి, దామోదర్ రెడ్డి, బొల్లమోని నరసింహ, మార్గం స్వామి తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీరు, పారిశుద్ధ్యంపై అధికారులు దృష్టి సారించాలి

*** సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో త్రాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రేత్యేక దృష్టి సారించి శాశ్వత పరిస్కారం చూపాలని, శంకుస్థాపనలు పూర్తయిన రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అధికారులను కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో మంగళవారం జరిగిన సిపిఐ కొత్తగూడెం పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో అయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యం భారినపడే ప్రమాదం ఉందని తక్షణమే అధికారులు ప్రేత్యేక డ్రైవులు ముమ్మరంగా చేపట్టాలని, పట్టణంలో త్రాగునీటి సమస్య ఉన్న వార్డులు, బస్తీలను గుర్తించి సమస్యకు పరిష్కరించాలన్నారు. ఈనెల 16న కొత్తగూడెం పట్టణ ఏఐకెఎస్ మహాసభ నిర్వహిస్తున్నామని, పట్టణపరిధిలోని రైతులు పాల్గొనాలని సూచించారు. దీంతోపాటు యువజన, విద్యార్థి, గిరిజన సమాఖ్య, ఏఐటీయూసీ పట్టణ మహాసభలు నిర్వహించబోతున్నామని ఈ మహాసభలను ఆయా సంఘాల పట్టణ బాధ్యులు విస్తృతంగా ప్రచారం నిర్వహించి సభలను విజయవంతం చేయాలనీ సూచించారు. గెడ్డాడు నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి మహిళ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉండాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మహిళల ఆర్థిక, సామాజిక స్థిరత్వం సాధనలో భాగంగా, జిల్లాలో "ఇందిర మహిళా శక్తి" కార్యక్రమం కింద అర్హులైన మహిళలు, వృద్ధ మహిళలు, దివ్యాంగులు , కిషోర బాలికలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చేందుకు మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు స్వయం సహాయక సంఘాల్లో లేని అర్హులైన గ్రామీణ మహిళలను గుర్తించి, వారిని సెర్ప్ ఆధ్వర్యంలో ఋణ సౌకర్యాలు, జీవనోపాధి అవకాశాలు, చిన్నతరహా వ్యాపారాల ప్రోత్సాహం వంటి పథకాలతో అనుసంధానించాల్సిన అవసరాన్ని ఆయన ఉటంకించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, అలాగే గ్రామీణ సమాజంలో వారి స్థానాన్ని బలపరచడం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. అందులో భాగంగా:వృద్ధ మహిళల సంఘాలు: 60 ఏళ్లు పైబడిన మహిళలతో 10-15 మంది సభ్యుల వృద్ధ స్వయం సహాయక సంఘాలు




*** దివ్యాంగుల సంఘాలు: 5–15 మంది సభ్యుల ప్రత్యేక సంఘాలు**

కిషోర బాలికల సంఘాలు: 15-18 సంవత్సరాల వయస్సు గల 10-15 మంది సభ్యుల సంఘాలు ఈ సంఘాల ద్వారా ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సాయం, శిక్షణ వంటి సదుపాయాలను అందించి, వారిని సమాజంలో మరింత చురుకుగా నిలిపే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామ స్థాయి సహాయక సిబ్బంది, సీసీలు, ఎంఎస్ ఓబీలు చురుకుగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అర్హురాలికి పథకం గురించి అవగాహన కల్పించడంతో పాటు, సంఘాలలో చేరడానికి అవసరమైన సదుపాయాలను అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సదస్సులో డి ఆర్ డి ఓ విద్యా చందన, అదనపు డి ఆర్ డి ఓ నీలేష్, మహిళా శిశు సంక్షేమ అధికారి శ్. స్వర్ణలత లెనినా, ఎల్‌డిఎమ్ రామిరెడ్డి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిడిఓ అనిల్, జీఎం (జిఐసి), జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, ఎంఎస్ ఓబీలు పాల్గొన్నారు.

## డాక్టర్. టీ ఇన్నారెడ్డి కి రాష్ట్ర రత్న అవార్డు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్రానికి చెందిన డాక్టర్. టీ ఇన్నారెడ్డి కి రాష్ట్ర రత్న అవార్డు లభించింది. హర్యానా లో యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ సుప్రీం నరేంద్ర ఆరోరా, నేషనల్ డైరెక్టర్ డాక్టర్. ఉప్పు సంజీవరావు, స్టేట్ కోఆర్డినేటర్ సౌజన్య గార్ల చేతుల మీదుగా తెలంగాణ చైర్మన్ అయినటువంటి డాక్టర్. టీ ఇన్నారెడ్డి కి రాష్ట్ర రత్న అవార్డు ఇచ్చి సత్కరించిన సందర్భంగా మంగళవారం కార్పొరేటర్ ను కలిసి ఆశీస్సులు తీసుకొన్నారు ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతు ప్రజలకు మంచి సేవాచేస్తూ, అవినీతి నీ నిర్మూలించడం లో క్రియాశీలకంగా ఉండాలని సూచించారు ఇన్నారెడ్డి మాట్లాడుతు ప్రజలకు మెరుగైన సేవలు చేస్తూ, అవినీతినీ నిర్మూలించడంలో తనవంతు కృషి చేస్తానని అన్నారు. రాబోయే రోజులలో మీ సహాయ సహకారాలు ఉండాలని సురేష్ రెడ్డి నీ కోరారు. ఈ కార్యక్రమం లో డివిజన్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ శివాజీ, నాయకులు సంగమేష్, ప్రభాకర్ లు ఉన్నారు.




## ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటే వారిపై కేసులు నమోదు చేస్తాం

**జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటే వారిపై కేసులు నమోదు చేస్తామని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల పోలీసుల ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయినటువంటి నిందితులను పోలీస్ స్టేషన్కు పిలిపించి వారికి సత్ప్రవర్తన కోసం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పాత నేరస్తులో ఎవరైనా మళ్లీ గాంజాయికి గాని ఇతర మత్తు పదార్థాలకు బానిసగనే కొనసాగుతున్నారా లేదా మారారా లేదా మారే ప్రయత్నం చేస్తున్నారా లేదా డ్రగ్ పెల్లారుగా మారారని విషయంపై వాళ్లు పిలిచి వారందరికీ కౌన్సిలింగ్ చేయడం జరిగిందన్నారు. ఇకనుంచి పాత నేరస్తుల్ని రెగ్యులర్ కౌన్సిలింగ్ చేయడంతో పాటు కళాశాలలో , వివిధ ప్రాంతాల్లో పబ్లిక్ తిరిగే ప్లేస్ లో గ్రౌండ్స్ లో కూడా యువతకు ఈ డ్రగ్స్ పైన అవేర్నెస్ కలిగించడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా అనుమానాస్తులు ఉంటే వారికి గవర్నమెంట్ అందించినటువంటి నార్కోటిక్ బ్యూరో అందించినటువంటి కిట్ల ద్వారా వారికి యూరిన్ టెస్ట్ చేసి అప్పుడు అప్పుడే రిజల్ట్స్ రాగానే ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లయితే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతోందన్నారు. మీ ఇంట్లో డ్రగ్స్ అలవాటు బానిస అయినటువంటి ఎవరైనా ఉంటే వారిని కౌన్సిల్ సెంటర్ పంపించడానికి పోలీసు వ్యవస్థ సహకరిస్తుందని, ఆర్థికంగా వెనుకబడిన వారు ఉంటే వారికి ఎన్ డి పి ఎస్ యాక్ట్ లోని యాక్టర్ ప్రకారం కోర్టు ముందు ప్రవేశపెట్టి వారిని కూడా ఈ యొక్క రియాబిటేషన్ సెంటర్ కు పంపించడం జరుగుతుందన్నారు.

## తులసినగర్ లో పర్యటించిన కార్పొరేటర్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి నగర్ లో వరద నీరు పొంగి రోడ్ల మీద ప్రవహిస్తూ కాలనీ వాసులకు ఇబ్బందిగా ఉందన్న విషయం తెలుసుకున్నా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి ఇంజినీరింగ్ విభాగం, జల మండలి అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఊట నీరు పొంగి డ్రైనేజీ లైన్ గుండా రోడ్లపైకి ప్రవహించడంతో నీరుతో పాటు మట్టి కూడా రోడ్డుపైకి వచ్చి కాలనీ వాసులకు సమస్య ఏర్పడిందని అన్నారు. వెంటనే వరద నీటి ప్రవాహం ఆగేలా చర్యలు తీసుకుని, రోడ్డుపై ఉన్న మట్టిని కూడా తొలగించి శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు. ఇప్పుడున్న డ్రైనేజీ లైన్ చిన్నగా ఉండి, నివాసాలు పెరగడంతో నిత్యం నిండిపోయి సమస్య ఏర్పడుతుందని, తొందరలో పెద్ద లైన్ నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కరం చూపిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎ.ఇ శ్రావణి, సమ్మారెడ్డి, మల్లేష్ గౌడ్, రమేష్, పోశెట్టిగౌడ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, సూపర్వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ పేషెంట్ కి అండగా నిలిచిన పిట్టల నాగరాజు



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలో వినాయక నగర్ 137 డివిజన్ లో వాచ్ పై నగర్ లో నివాసం ఉంటున్న జ్యోతి అనే నిరుపేద వృద్ధురాలికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో డయాలసిస్ కొరకు ఖర్చులకు మైనంపల్లి హనుమంతరావు చేతుల మీదుగా 10,000 ఆర్థిక సాయం చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా పిట్టల నాగరాజు మాట్లాడుతూ జ్యోతి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశిస్తూ తనకెప్పుడూ భగవంతుడు ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా పోరాడే అవకాశాన్ని ప్రజలు కల్పిస్తారని ఆశిస్తూ అలాగే మైనంపల్లి హనుమంతరావు స్ఫూర్తితో మరో ఎన్నో సేవలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పిఎన్ఆర్ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఇక్కడ ఫెన్సింగ్ ఉంటే మాకేంటి..?

*** మాకు అడ్డుకునేది ఎవరు..?ఆపేదెవరు..?**

ప్రజాస్ఫూర్తి ఇల్లందు:సోషల్ మీడియాలో ఈత కొట్టే ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసి వాటి నుండి వచ్చిన లైక్‌లు, కామెంట్‌లు చూసి తెగ సంబరపడిపోతారు. కానీ, అక్కడ పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించకపోవడం వల్ల ప్రాణాలే పోగొట్టుకునే ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజా వర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెరువులు కళకళలాడుతున్నాయి. అయితే, ఇల్లందు పట్టణంలోని ఇల్లందులపాడు చెరువు అలుగు వద్ద మాత్రం ఆ అందం వెనుక ఒక ప్రాణాంతక ముప్పు దాగి ఉంది. మున్సిపల్ అధికారులు ప్రమాదాన్ని గుర్తించి, ఎవ్వరూ అలుగు వద్దకు చేరకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, కొందరు యువకులు, పిల్లలు అడ్డంకులను పట్టించుకోకుండా అలుగు కట్టపై ఎక్కి ఈత కొడుతూ, రీల్స్ కోసం వీడియోలు, ఫోటోలు దిగుతున్నారు. అలుగు వద్ద నాచు పట్టి క్రింద పడి గాయపడిన ఘటనలు ఇప్పటికే చోటు చేసుకున్నాయి. అంతకుముందు ఈ చెరువులో ఈతకు వెళ్లి



ప్రాణాలు కోల్పోయిన విషాదాలు కూడా ఉన్నాయి.

**ప్రాణాపాయం జరగకముందే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి**

మున్సిపల్ సిబ్బంది అలుగు వద్ద క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలి.ప్రజలు సెల్ఫీ, రీల్ మోజు కంటే ప్రాణాలను ముందుగా కాపాడుకోవాలి.తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గృహ నిర్బంధం



హైదరాబాద్: భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నేడు బంజారాహిల్స్ పెద్దమ్మ గుడిలో భాజపా నేతలు కుంకుమార్చన చేయాలని నిర్ణయించారు. కొన్ని రోజుల క్రితం దుండగుడు ఈ ఆలయాన్ని ధ్వంసం చేయడంతో వివాదం నెలకొంది. ఇక్కడికి రామచందర్ రావు వెళ్తారనే సమాచారంతో హౌస్ అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఆయన నేడు హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా సికింద్రాబాద్, గోషామహల్ నియోజకవర్గాల్లో పర్యటించాల్సి ఉంది.

**హౌస్ అరెస్టు సరికాదు: గంగిడి మనోహర్‌రెడ్డి**

రామచందర్ రావును గృహనిర్బంధం చేయడం సరైంది కాదని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ప్రతిపక్ష పార్టీల నాయకులను నిర్బంధించడం మానుకోవాలని చెప్పారు. నిర్బంధాలతో కార్యక్రమాలను అడ్డుకోవాలని చూడడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ సర్కారు కూడా ముందస్తు అరెస్టులు చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు తావులేదని దుయ్యబట్టారు. ఇదేవిధంగా కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని గంగిడి మనోహర్‌రెడ్డి హెచ్చరించారు.

## బీజాపూర్‌లో ఎదురు కాల్పులు



చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం ఉదయం మావోయిస్టులు, భద్రత బలగాల నడుమ భీకర ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో సోమవారం సాయంత్రం ఇక్కడ అడవులకు డీఆర్జీ (డిస్టిక్ రిజర్వుడ్ గార్డ్) బలగాలు ఆపరేషన్‌కు బయలుదేరి వెళ్లాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎదురు కాల్పులు జరుగుతున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో కొందరు మావోయిస్టులు సైతం గాయపడి ఉంటారని భావిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## తెలంగాణలో భారీ వర్షాల ఎఫెక్ట్..
## ఐదు జిల్లాల్లోని పాఠశాలలకు సెలవులు



హైదరాబాద్: భారీ వర్షసూచన దృష్ట్యా తెలంగాణలోని ఐదు జిల్లాల్లోని పాఠశాలలకు బుధ, గురువారాల్లో సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పాఠశాలల్లోనూ బుధ, గురువారాల్లో ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని సీఎం ఆదేశించారు. ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్‌లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. హైదరాబాద్‌లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేసేలా అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.

## దేవాలయ భూములు కాపాడుతాం: మంత్రి సురేఖ



రాష్ట్రంలో ఎండోమెంటు భూములను కాపాడుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. మంగళవారం ఎండోమెంట్ ఆఫీసు (బొగ్గులకుంట)లో బోనాల కార్యక్రమంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. కడ్తాల్ విలేజ్ లో డిజిటలైషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక సంవత్సరంలో ఎండోమెంట్ లాండ్స్ డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు. దేవదాయ భూములను పరిరక్షించేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్టు ఆమె పునర్ ఉద్ఘాటించారు.

# గుజరాత్ లోని రిలయన్స్ రిఫైనరీని టార్గెట్ చేస్తాం: అసిమ్ మునీర్ హెచ్చరిక

* రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామన్న పాక్ ఆర్మీ చీఫ్
* అమెరికా పర్యటనలో జనరల్ అసీమ్ మునీర్ వివాదాస్పద వ్యాఖ్యలు
* ఇది అణు బెదిరింపేనని తీవ్రంగా స్పందించిన భారత విదేశాంగ శాఖ
* ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాఖ్యలు

పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ తన అమెరికా పర్యటనలో భారత్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూ కవ్వింపులకు పాల్పడుతున్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్ లో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించారు. ఈ రిఫైనరీ ప్రపంచంలోనే అతిపెద్ద సింగిల్‌సైట్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌గా గుర్తింపు పొందింది. అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఒక విందు సమావేశంలో, మునీర్ ఆర్ఐఎల్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ చిత్రంతో పాటు ఖురాన్ శ్లోకాన్ని ప్రస్తావిస్తూ ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను ప్రస్తావించారు. అంతేకాదు, భారత్ కు అణు హెచ్చరికలు కూడా చేశారు. అమెరికా నేలపై నుంచి మునీర్ చేసిన ఈ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ యొక్క యుద్ధోన్మాద వైఖరిని స్పష్టంగా చూపిస్తున్నాయని భారత్ అభిప్రాయపడింది. కాగా, మునీర్ న్యూక్లియర్ వార్నింగ్ నేపథ్యంలో... భారత్, పాకిస్థాన్ దేశాల సైనిక, అణు సామర్థ్యంపై చర్చ మొదలైంది.

**సైనిక బలం: భారత్ ఆధిపత్యం**

ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ ప్రకారం, భారత్ సైనిక బలం పాకిస్థాన్ కంటే చాలా ఎక్కువ. భారత్‌లో సుమారు 14 లక్షల మంది సక్రియ సైనిక సిబ్బంది ఉన్నారు, వీరిలో 12.3 లక్షలు ఆర్మీ, 75,500 నౌకాదళం, 1,49,900 వైమానిక దళం, మరియు 13,350 కోస్ట్ గార్డ్‌లో ఉన్నారు. దీనికి విరుద్ధంగా, పాకిస్థాన్‌లో 7 లక్షల కంటే తక్కువ సైనిక సిబ్బంది ఉన్నారు. 5,60,000 మంది ఆర్మీ, 70,000 మంది వైమానిక దళం, మరియు 30,000 మంది నౌకాదళంలో ఉన్నారు. అంతేకాక, భారత్‌లో 25 లక్షల మంది పారామిలటరీ బలగాలు ఉండగా, పాకిస్థాన్‌లో కేవలం 5 లక్షల మంది మాత్రమే ఉన్నారు.

* **న్యూక్లియర్ సామర్థ్యం: భారత్ ముందంజ**

రెండు దేశాలు న్యూక్లియర్ ఆయుధాలను కలిగి ఉన్నప్పటికీ, గత 20 ఏళ్ల గణాంకాలను పరిశీలిస్తే... భారత్‌లో 180 న్యూక్లియర్ వార్‌హెడ్‌లు ఉండగా, పాకిస్థాన్‌లో 170 ఉన్నాయని అంచనా. భారత్ అగ్ని5 క్షిపణులు బహుళ లక్ష్యాలను ఒకేసారి ఛేదించగల మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్స్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికతను కలిగి ఉన్నాయి. అగ్ని5 రేంజ్ 5,000 నుంచి 8,000 కి.మీ. వరకు ఉండగా, పాకిస్థాన్ యొక్క షాహీన్ 3 క్షిపణి రేంజ్ 2,750 కి.మీ. మాత్రమే.

## భారీ వర్ష సూచన.. వచ్చే మూడ్రోజులు ప్రజలు బయటకు రావొద్దు: హైడ్రా

భాగ్యనగరంలో రేపటి నుంచి మూడ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైడ్రా వెల్లడించింది. ఈ నెల 13, 14, 15 తేదీల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది. మేడ్చల్ జిల్లాతోపాటు సైబరాబాద్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 10నుంచి 15 సెం.మీ వర్షపాతం పడుతుందని, కొన్ని ప్రాంతాల్లో 20సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. వచ్చే మూడ్రోజులు ప్రజలెవరూ బయటకు రావొద్దని హైడ్రా విజ్ఞప్తి చేసింది. ముప్పు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## న్యాయవాద దంపతుల హత్య కేసు సీబీఐకి.. సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యాయవాదులైన గట్టు వామనరావు దంపతుల హత్య కేసును సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించింది. ఈమేరకు సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తునకు ఇస్తే తమకేమీ అభ్యంతరం లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మరోవైపు మరణవాంగ్మూలం వీడియో అసలుదేనని ఎఫ్ఎస్ఎల్ నివేదిక తేల్చింది. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది. అన్ని అంశాలను పరిశీలించి దర్యాప్తు చేయాలని సీబీఐను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. 2021 ఫిబ్రవరి 17న గట్టు వామనరావు దంపతులు హత్యకు గురయ్యారు. పెద్దపల్లి జిల్లా కల్వచర్ల వద్ద కారులో వెళ్తున్న వీరిని అడ్డుకొని రోడ్డుపై హత్య చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని వామనరావు తండ్రి పిటిషన్ దాఖలు చేశారు.

## విమానం దారిమళ్లింపు ఘటన.. లోక్‌సభ స్పీకర్‌కు ఎంపీల ఫిర్యాదు




తాము ప్రయాణిస్తున్న తిరువనంతపురం దిల్లీ ఎయిరిండియా విమానాన్ని చెన్నైకు మళ్లించడాన్ని ఎంపీలు ప్రశ్నించారు. సదరు విమానయాన సంస్థ తమ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు. ఈ క్రమంలోనే దానిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్‌కు చెందిన కేసీ వేణుగోపాల్ సహా ఐదుగురు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కోరారు. పార్లమెంట్ సభ్యులు కేసీ వేణుగోపాల్, కొడికున్నిల్ సురేశ్, ఆదూర్ ప్రకాశ్, కె.రాధాకృష్ణన్, సి.రాబర్ట్ బ్రూస్ సహా 150 మంది ప్రయాణికులతో కూడిన ఎయిరిండియా విమానం ఈ నెల 10న తిరువనంతపురం నుంచి దిల్లీకి బయల్దేరింది. మార్గమధ్యంలో సాంకేతిక లోపం కారణంగా విమానాన్ని చెన్నైకి మళ్లించారు. ఆ సమయంలో బెంగళూరు, కోయంబత్తూరు వంటి ఇతర విమానాశ్రయాలు సమీపంలోనే ఉండగా.. చెన్నైకు మళ్లించడాన్ని ఎంపీలు ప్రశ్నించారు. ఈ నిర్ణయం వెనుక కారణాన్ని సంస్థ వివరించలేదన్నారు. విమానాన్ని చెన్నైకు మళ్లించినప్పటికీ.. నేరుగా ల్యాండ్ చేయలేదని, అక్కడే గంటకుపైగా చక్కర్లు కొట్టినట్లు ఎంపీలు తెలిపారు. తొలిసారి ల్యాండింగ్‌కు విఫలయత్నం చేశారని.. బహుశా రన్‌వేపై మరో విమానం ఉండటం వల్ల కావచ్చనే పైలట్ ప్రకటనను ఉటంకించారు. ఎట్టకేలకు అర్ధరాత్రి దాటిన తర్వాత మరో విమానంలో దిల్లీకి వెళ్లినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై తాము ఆందోళనలు లేవనెత్తగా.. తప్పుడు ప్రకటనలు చేశామంటూ ఎయిరిండియా చిత్రీకరించిందన్నారు. తద్వారా ఎంపీల ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు.

## సీబీఐకి వామనరావు దంపతుల హత్యకేసు..
### స్వాగతించిన మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్ :** న్యాయవాదులు గట్టు వామనరావు దంపతుల హత్యకేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి.. ఈ విషయంపై మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో వామనరావు దంపతులను దారుణంగా హత్య చేస్తే విచారణ కూడా సరిగ్గా చేపట్టలేదని మంత్రి విమర్శించారు. దీంతో వామనరావు తండ్రి వెంకటరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వారి హత్యల్లో గత ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని, దోషులు ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. న్యాయవాదుల రక్షణ కోసం, చట్టం తెచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## తెలంగాణలో ఎనిమీ ప్రాపర్టీస్‌పై తక్షణమే సర్వే చేయండి
### కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశం



**ఢిల్లీ :** నెలాఖరులోపు స్వాతంత్ర్య సమరయోధుల పింఛను కేసులను పరిష్కరించాలని అధికారులను కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. దీనిపై తక్షణమే సర్వే చేయాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా 12,800 ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయని కేంద్రమంత్రికి అధికారులు తెలిపారు. 600కుపైగా ప్రాపర్టీస్ వేలందశలో ఉన్నాయని వివరించారు. వేలం వేసిన ఆస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.107 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. పెండింగ్ ఫైళ్లను వేగంగా క్లియర్ చేసిన అధికారులను కేంద్రమంత్రి అభినందించారు.

## హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
# రామచందర్‌రావు గృహ నిర్బంధం

* పెద్దమ్మ గుడిలో కుంకుమార్చనకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
* ఇటీవల ధ్వంసమైన ఆలయాన్ని సందర్శించాలని బీజేపీ నేతల నిర్ణయం
* హర్ ఘర్ తిరంగా యాత్రకూ ఆటంకం
* ప్రభుత్వ తీరుపై బీజేపీ నేతల తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును పోలీసులు ఈ ఉదయం ఆయన నివాసంలోనే గృహ నిర్బంధం చేశారు. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ గుడికి వెళ్లకుండా అడ్డుకునేందుకే ఈ చర్యలు తీసుకున్నారు. కొన్ని రోజుల క్రితం దుండగులు ధ్వంసం చేసిన బంజారాహిల్స్ పెద్దమ్మ గుడిలో కుంకుమార్చన చేయాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రామచందర్‌రావు వెళ్తారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యగా ఆయనను ఇంటి నుంచి బయటకు రాకుండా నిర్బంధించారు. ఈ పరిణామంతో ఆయన సికింద్రాబాద్, గోషామహల్ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన 'హర్ ఘర్ తిరంగా' యాత్రకు కూడా ఆటంకం ఏర్పడింది. రామచందర్‌రావు గృహ నిర్బంధాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి ప్రతిపక్ష పార్టీల నాయకులను అణచివేయాలని చూడటం దురదృష్టకరం. నిర్బంధాలతో కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం" అని విమర్శించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనలో తేడా కనిపించడం లేదని ఆయన విమర్శించారు. ముందస్తు అరెస్టులు చేయడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇదే వైఖరిని కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని మనోహర్ రెడ్డి హెచ్చరించారు.



## తెలంగాణలో భారీ వర్షాలు.. అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు: సీఎం రేవంత్

**హైదరాబాద్:** తెలంగాణలో భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని సీఎం ఆదేశించారు. ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్‌లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. "ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. భారీ వర్షాలు పడే జిల్లాలకు సిబ్బందిని ముందుగానే పంపించాలి. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో సీనియర్ అధికారులను ప్రత్యేకంగా నియమించాలి. వర్షాలు, వరదలపై మీడియా ద్వారా సమాచారం చేరవేయాలి. వరదలపై ఫిర్యాదు కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి. హైదరాబాద్‌లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా ఉండాలి. విద్యా సంస్థలకు సెలవులపై తగు చర్యలు తీసుకోవాలి. ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేసేలా అప్రమత్తం చేయాలి. వీలైనంత వరకు ప్రజలు రహదారులపైకి రాకుండా చూడాలి. ప్రాణ, ఆస్తి, పశుసంపద నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్ విద్యార్థిని మృతి



**దుండిగల్ :** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రామారుకల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజా వర్మ, శ్రేయా వర్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాస్ వర్మ దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని శ్రీకృష్ణానగర్‌లో నివాసముంటున్నారు. శ్రీనివాస్‌వర్మ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆయన భార్య ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. వీరి పెద్ద కుమార్తె శ్రీజా వర్మ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. ఈ మధ్యే ఎంఎస్ పూర్తి చేసింది. సోమవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వచ్చి భోజనం చేసేందుకు కారులో రెస్టారెంట్‌కు వెళ్లింది. భోజనం చేసి తిరిగి వస్తుండగా ఆమె వాహనాన్ని ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీజా వర్మ తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో శ్రీజా వర్మతో పాటు ఆమె స్నేహితురాలు కూడా ఉన్నట్లు సమాచారం. శ్రీనివాస్ వర్మ చిన్న కుమార్తె శ్రేయా వర్మ సైతం ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లింది.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు సిట్‌కు బదిలీ: నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్



**హైదరాబాద్:** సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసును సిట్‌కు బదిలీ చేసినట్లు నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకు వెల్లడించారు. జులైలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. "ఈ కేసులో మొదట 8 మందిని.. తర్వాత 16 మందిని అరెస్టు చేశాం. అరెస్టయిన వారిలో వైద్యులు, ఏజెంట్లు ఉన్నారు. రెండో కేసులో చనిపోయిన బేబీని చూపించి బాధితుల నుంచి రూ.10లక్షలు నుంచి రూ.20లక్షలు వసూలు చేశారు. డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాను నిలిపివేశాం. గైనకాలజీ డాక్టర్ సూరి శ్రీమతి పేరుపై ఉన్న లైసెన్స్ నంబర్, లెటర్ హెడ్స్‌తో అక్రమాలు చేశారు. ఆమె ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేశాం. సికింద్రాబాద్‌లో సృష్టి సెంటర్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. ఈ సెంటర్‌కు అనుమతులు రద్దయి చాలా కాలమైంది. ధనశ్రీ సంతోషి ప్రధాన ఏజెంట్ కాగా.. మరికొందరిని సబ్ ఏజెంట్లుగా నియమించుకొని నెట్‌వర్క్‌ను విస్తరించారు. విశాఖ నుంచి పిల్లల వైద్యురాలు విద్యుల్లత, వైద్యులు రవి, ఉష పనిచేశారు. ఈ కేసులో సరోగేట్‌గా, అండదానం ఇచ్చే వారిగా కొందరు మహిళా ఏజెంట్లు నటించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మా వర్కర్స్ కూడా ఈ కేసులో భాగస్వాములుగా ఉన్నారు. 9 నెలల పూర్వవుతున్న గర్భవతులను గుర్తించి సరోగసీ కోసం వచ్చిన తల్లిదండ్రులకు అప్పగించారు. మగ బిడ్డకు రూ.4.5 లక్షలు, ఆడబిడ్డకు రూ.3లక్షల ధర నిర్ణయించారు. ఇలాంటి సెంటర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమతులు ఉన్న వాటినే సంప్రదించాలి" అని డీసీపీ రష్మి పెరుమాళ్ సూచించారు.

# కశ్మీర్‌లో బలగాలకు సవాల్..! ఎవరీ 'బెడ్‌రూం జిహాదీలు'

జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదులతో ఏళ్ల తరబడి ప్రత్యక్షంగా పోరాడిన భద్రతా సంస్థలు ప్రస్తుతం రహస్య శత్రువును ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఇంట్లోనే కూర్చుని సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుడు సమాచార వ్యాప్తికి పాల్పడుతున్న, వర్గ విభేదాలను రెచ్చగొడుతున్న 'బెడ్‌రూం జిహాదీ'ల రూపంలో వారికి సవాల్ ఎదురవుతోంది. సాంప్రదాయ ఉగ్రవాదులకు భిన్నంగా ఉండే ఈ దుర్మార్గులు జమ్మూకశ్మీర్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనికోసం సోషల్ మీడియాలో అనేక నకిలీ ఖాతాలు తెరిచినట్లు గుర్తించినట్లు వెల్లడించారు.



కశ్మీర్ లోయలో మత కలహాలు, అశాంతి సృష్టించాలనే లక్ష్యంతో దుష్ప్రచారం, రెచ్చగొట్టే కంటెంట్ వ్యాప్తికి పాల్పడుతున్న సోషల్ మీడియా ఖాతాల నెట్‌వర్క్‌ను అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర సంస్థలు, వాటి సానుభూతిపరులు దీన్ని నియంత్రిస్తున్నట్లు భావిస్తున్నారు. అనేక వారాలుగా కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా వేలాది సోషల్ మీడియా పోస్టులు, వ్యాఖ్యలు, ప్రైవేటు సందేశాలను అధికారులు విశ్లేషించారు. ఈ క్రమంలోనే ఈ సంఘ విద్రోహక కార్యకలాపాలకు పాక్‌లో ఉన్న హ్యాండ్లర్లకు ప్రత్యక్ష సంబంధం ఉందనేందుకు ఆధారాలు లభ్యమయ్యాయి. "కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్‌ల సాయంతో ఈ జిహాదీలు ఎక్కడి నుంచైనా యుద్ధం చేస్తున్నారు. వదంతులు వ్యాప్తి చేస్తున్నారు. యువతను ప్రభావితం చేస్తున్నారు" అని ఓ అధికారి వెల్లడించారు. ఓ సోషల్ మీడియా పోస్టు ద్వారా ఇటీవల స్థానికంగా ఇలాగే ఇరువర్గాల మధ్య చిచ్చుపెట్టారని, కానీ.. శ్రీనగర్ పోలీసులు సకాలంలో స్పందించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు. మరో కేసులో.. ఓ వర్గానికి చెందినవారి వ్యక్తిగత వివరాలు సామాజిక మాధ్యమాల్లో లీకయ్యాయని తెలిపారు. ఈ వ్యవహారంలో ఓ యువకుడిని అరెస్టు చేసి విచారించగా.. పొరుగుదేశం నుంచి తనకు ఈమేరకు ఆదేశాలు వచ్చాయని చెప్పాడన్నారు. వాస్తవానికి, 2017లోనే ఈ పెడ ధోరణి మొదలైంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు అనంతరం స్థానికంగా ఇంటర్నెట్‌పై ఆంక్షల వంటి చర్యలతో దీనికి అడ్డుకట్ట పడింది. అయితే.. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఈ 'బెడ్‌రూం జిహాదీ'లు మరోసారి జడలు విప్పినట్లు అధికారులు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరచడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వారి లక్ష్యాలు కావొచ్చని చెప్పారు. ముప్పు ఎప్పటికప్పుడు రూపం మార్చుకుంటోందని ఈ పరిణామాలు చాటిచెబుతున్నాయని, దీన్ని మొగ్గలోనే తుంచేయాలని జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ కుల్దీప్ ఖోడా పేర్కొన్నారు.

## ఆ సీఎంలు మాట్లాడారు.. త్వరలోనే సెమీకండక్టర్ ప్లాంట్ నిర్మాణ పనులు: అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: కేంద్ర క్యాబినెట్ కొత్తగా ఆమోదించిన నాలుగు సెమీకండక్టర్ తయారీ ప్లాంట్ల నిర్మాణ పనులు అతి త్వరలోనే ప్రారంభమవుతాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గతంలో మంజూరైన ఆరు ప్లాంట్‌లకు అనుమతులన్నీ రికార్డు సమయంలోనే వచ్చాయన్నారు. చాలావరకు 100 రోజుల్లోనే అనుమతులు వచ్చేశాయని.. ఆరు నెలల వ్యవధిలోనే వారు తమ డిజైన్, నిర్మాణాలను ప్రారంభించారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రకటించిన వాటి విషయంలోనూ అదే పురోగతి ఉంటుందని భావిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా సీఎంలు ఇప్పుడే తనతో మాట్లాడారని వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీకి వారు కృతజ్ఞతలు చెప్పారని తెలిపారు. రికార్డు సమయంలోనే నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తనకు హామీ ఇచ్చారన్నారు. దేశంలో నాలుగు కొత్త సెమీ కండక్టర్ ప్రాజెక్టులు ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా





ఊపిన విషయం తెలిసిందే. ఏపీ సహా ఒడిశా, పంజాబ్‌లో సెమీ కండక్టర్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. మొత్తంగా రూ.4,594 కోట్ల వ్యయంతో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం పేర్కొంది. పట్టణ రవాణాను మరింత బలోపేతం చేసేలా లఖ్‌నవూ మెట్రో ఫేజ్ 1బి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దీన్ని రూ.5,801 కోట్లతో చేపట్టనున్నట్లు పేర్కొంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో 700 మెగా వాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

## దేశవ్యాప్తంగా 'ఓట్ల చోరీ' : ఈసీపై రాహుల్ విసుర్లు

దిల్లీ: గతేడాది ఏడాది జరిగిన కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపా ఓటర్లను మోసం చేయడానికి ఎన్నికల కమిషన్ (EC)తో కుమ్మక్కైందని..ఇప్పుడు బిహార్ ఎన్నికల్లో కూడా అదే వ్యూహాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. "ఒకటి, రెండు కాదు... చాలా సీట్లలో అవకతవకలు జరిగాయి. ఇదంతా జాతీయ స్థాయిలో... ఓ క్రమపద్ధతిలో జరుగుతోంది. ఎన్నికల కమిషన్‌కు కూడా ఈ విషయం తెలుసు. దానిని నిరూపించడానికి మా దగ్గర ఇన్ని రోజులు ఎటువంటి ఆధారాలు లేవు. ఇప్పుడు ఆధారాలు మా చేతికి వచ్చాయి. ఇంకా చాలా విషయాలు బయటకు రాబోతున్నాయి." అంటూ ఈసీని హెచ్చరించారు. ఓట్ల దొంగతనం ఎన్నికల కుంభకోణం మాత్రమే





కాదని..ప్రజాస్వామ్యానికి జరిగిన పెద్ద ద్రోహమని రాహుల్ అన్నారు. సమయం వచ్చినప్పుడు ఓట్ల చోరీకి పాల్పడిన వారికి కచ్చితంగా శిక్ష పడుతుందన్నారు. పార్లమెంట్ వెలుపల విపక్ష ఎంపీలు నిరసన చేపట్టిన అనంతరం కాంగ్రెస్ నేత మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. స్కాన్ చేసిన ఓటరు జాబితా చిత్రాలను పోస్టు చేయడానికి బదులుగా డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయాలని ఈసీని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజక వర్గంలో సర్వే నిర్వహించగా.. దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలినా ఈ విషయంపై ఎన్నికల సంఘం మౌనం వహిస్తోందని రాహుల్ మండిపడ్డారు. స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షపాత ఎన్నికలను నిర్వహించి.. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ఇలా చేస్తే ఇంకెవరికి ఫిర్యాదు చేయాలని ప్రశ్నించారు. 'ఓట్ల చోరీ' దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సందర్భంగా అనేక నియోజకవర్గాల్లో కొనసాగిందని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని కోరారు.

## 'గణాంకాలతో సిద్ధంగా ఉండండి'.. ఎన్నికల సంఘానికి సుప్రీం సూచన

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే సరైన వివరాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం సూచించింది. విచారణ క్రమంలో ఆర్జేడీ నేత మనోజ్ ఝా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఓ నియోజకవర్గంలో 12 మంది చనిపోయారని ఈసీ పేర్కొందని, కానీ వారు సజీవంగా ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మరో సందర్భంలో.. బతికే ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు ప్రకటించారని ఆరోపించారు. అయితే.. ఇటువంటి ప్రక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్లు, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్లు ప్రకటించడం వంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని.. ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే.. వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి 'సుప్రీం' ధర్మాసనం సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు; గతంలో నమోదైన మరణాల సంఖ్య; ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. బిహార్ ఎస్ఐఆర్ ప్రక్రియలో 7.9 కోట్లమంది ఓటర్లలో 7.24 కోట్ల మంది పత్రాలు సమర్పించారని.. కోటిమంది ఓటర్లు గల్లంతయ్యారనే ఆరోపణలకు ఇది తెరదించుతోందని పేర్కొంది. అదేవిధంగా.. ఎస్ఐఆర్ ప్రక్రియలో పౌరసత్వానికి రుజువుగా ఆధార్, ఓటరు కార్డులను అంగీకరించకూడదనే ఈసీ నిర్ణయంతో ఏకీభవించింది. బిహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటామని జులై 29న సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న విషయం తెలిసిందే. అంతకుముందు జులై 10న చేపట్టిన విచారణ సందర్భంగా.. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది.



అదేవిధంగా ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఓటర్ ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఇదిలా ఉండగా.. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యింది. ఈ నెల 1న ముసాయిదా జాబితాను ప్రచురించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టక ముందు రాష్ట్రంలో మొత్తం నమోదిత ఓటర్ల సంఖ్య 7.9 కోట్లుగా ఉండగా, ముసాయిదాలో అది 7.24 కోట్లకు తగ్గింది. సెప్టెంబర్ 30న తుది జాబితాను ప్రకటించనున్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

## ప్రియాంకా గాంధీ వ్యాఖ్యలకు ఇజ్రాయెల్ రాయబారి కౌంటర్

గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందని, ఇప్పటికే వేలాది మంది మరణానికి కారణమైందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఆరోపించారు. వీటిని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఖండించారు. గాజాలోని వేలాది మంది హమాస్ ఉగ్రవాదులనే తాము చంపామని బదులిచ్చారు. గాజాలో నెలకొన్న పరిస్థితులపై స్పందించిన ప్రియాంక.. "ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోంది. 60 వేల మందిని హత్య చేసింది. వారిలో 18,430 మంది చిన్నారులే. పిల్లలు సహా అనేక మంది ఆకలితో చనిపోయారు" అని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ప్రపంచం మౌనంగా ఉండటాన్ని ఖండించిన ఆమె.. ఇలా ఉండటం కూడా నేరమేనంటూ భారత ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు. ప్రియాంక గాంధీ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ స్పందించారు. "మీ వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయి. 25వేల మంది



హమాస్ ఉగ్రవాదులను ఇజ్రాయెల్ చంపింది. సామాన్యుల వెనుక దాక్కొని హమాస్ హేయమైన వ్యూహాలకు పాల్పడుతుండటం వల్ల ప్రాణనష్టం మరింత పెరుగుతోంది" అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ 20లక్షల టన్నుల ఆహార పదార్థాలను గాజాలోకి పంపించిందని, హమాస్ మాత్రం వారిని నిర్బంధిస్తోందని ఆరోపించారు. ఇదే అక్కడ ఆకలికి కారణమవుతోందన్నారు. గాజాలో మారణహోమం లేదని, గడిచిన 50 ఏళ్లలో అక్కడి జనాభా 450 శాతం పెరిగిందన్నారు.

## ఓవైపు యుద్ధ హెచ్చరికలు.. మరోవైపు నీటి కోసం అభ్యర్థనలు

ఇస్లామాబాద్: భారత్‌పై పాక్ ఉగ్రవాదులు దాడుల నేపథ్యంలో పాకిస్థాన్‌కు సింధూ జలాలను ఆపేస్తూ.. భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై ఓ వైపు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మాజీ మంత్రి బిలావల్ భుట్టో బెదిరింపులకు పాల్పడుతుండగా.. మరోవైపు తమకు నీటిని విడుదల చేయాలని ఆ దేశ విదేశాంగ శాఖ భారత్‌ను వేడుకుంటోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌కు నిలిపివేసిన సింధూ జలాల సరఫరాను తిరిగి పునరుద్ధరించాలని ఆ దేశ విదేశాంగ శాఖ తాజాగా న్యూదిల్లీని కోరింది. ఈ ఒప్పందాన్ని నమ్మకంగా, న్యాయబద్ధంగా కొనసాగించాలని కోరుతున్నట్లు తెలిపింది. మరోవైపు పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ భారత్‌పై అణు హెచ్చరికలు చేస్తూ.. నోరు పారేసుకుంటున్నారు. 'భారత్ అనేది హైవేపై వస్తున్న ఒక మెర్సిడెస్ కారులాంటిది. కానీ.. పాకిస్థాన్ మాత్రం కంకరతో



నిండిన ఓ డంప్ లారీలాంటిది. ఒకవేళ కారు వచ్చి లారీని ఢీకొంటే ఎవరికి నష్టం?" అని మునీర్ తన ప్రసంగంలో పేర్కొన్నట్లు జాతీయ మీడియాలో సోమవారం కథనాలు వచ్చాయి. ఆ దేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో సైతం భారత్‌పై పిరికిపంద ప్రేలాపనలు చేశారు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగితే.. యుద్ధం గురించి ఆలోచించడం తప్ప మరో మార్గం లేదని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు. ఈ నేపథ్యంలో నీటిని విడుదల చేయాలని భారత్‌ను, పాక్ విదేశాంగ శాఖ అభ్యర్థించడం గమనార్హం. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూదిల్లీ నిలిపివేయడంతో దాయాది దేశానికి నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. జలాశయాల్లో నీటిమట్టం దారుణంగా పడిపోయింది. ఇక వాటినుంచి నీటిని తీసుకోలేని స్థితి ఎదురవుతోంది. గతేడాదితో పోలిస్తే సింధు బేసిన్‌లో నీటి ప్రవాహం 15 శాతం తగ్గింది. వేసవిలో పంటలు ఎండి కష్టాల్లో పడిన రైతులకు ఖరీఫ్‌లో మరిన్ని కష్టాలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. భారత్ నిర్ణయంతో 21 శాతం నీటి కొరత ఏర్పడుతుందని పాక్ అంచనా వేసింది. అయితే ఉగ్రవాదంపై పాక్ తీరు మారే వరకూ ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేసింది.

## నోట్ల కట్టల వ్యవహారం.. జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానాన్ని స్వీకరించిన స్పీకర్





ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఆయన అభిశంసన తీర్మానాన్ని తాజాగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్వీకరించారు. ఘటనపై విచారణకు ముగ్గురు సభ్యులతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు సీజే జస్టిస్ మణీందర్ మోహన్, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్యలు ఈ ప్యానెల్‌లో సభ్యులుగా ఉన్నారు. అభిశంసనపై 146 మంది ఎంపీలు సంతకాలు చేయగా.. దాన్ని స్పీకర్ ఓం బిర్లా స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమిటీ తన నివేదికను వీలైనంత త్వరగా సమర్పించాలని కోరారు. అవినీతి వ్యతిరేక పోరాటంలో పార్లమెంటు ఐక్యంగా ఉంటుందన్నారు. స్పీకర్ ఏర్పాటు చేసిన కమిటీకి ఘటనకు సంబంధించి సాక్షులను పిలిచి ప్రశ్నించే అధికారం కూడా ఉంటుంది. నివేదికను తొలుత స్పీకర్‌కు సమర్పిస్తారు. ఆ తర్వాత సభలో ప్రవేశపెట్టి దానిపై ఓటింగ్ నిర్వహిస్తారు. దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలను ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా.. అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని తేల్చింది. ఆ నివేదికను జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. అక్కడ ఆయనకు చుక్కెదురైంది.

## వందే 'భారత్': ఆసక్తికర మ్యాప్ షేర్ చేసిన అమితాబ్ కాంత్

వందే భారత్ రైలు దేశాన్ని ఏకతాటిపైకి తీసుకెళ్తోందని జీ20కి భారత్ తరఫున షెర్పాగా వ్యవహరించిన అమితాబ్ కాంత్ అన్నారు. 'కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒక్కో ట్రాక్‌తో దేశాన్ని కలుపుతోంది' అంటూ ఎక్స్ వేదికగా ఒక మ్యాప్‌ను షేర్ చేశారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన 'వందే భారత్' రైలు మార్గాలు భారత భౌగోళిక చిత్రపటాన్ని ఆవిష్కరించేలా ఉండడంతో ఈ పోస్టు ఆసక్తికరంగా మారింది. ఈ పోస్టుపై నెటిజన్లు స్పందించారు. మ్యాప్ బాగుందని కొందరు కొనియాడారు. ప్రస్తుతం వందేభారత్ సగటు వేగం గంటకు 85 కిలోమీటర్లు మాత్రమేనని, మనకు కనీసం గంటకు 150 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెట్టే రైళ్లు కావాలని ఓ నెటిజన్ కామెంట్ పెట్టారు. అందుకోసం





ప్రభుత్వం మౌలిక వసతుల మెరుగుదలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని రాసుకొచ్చారు. ఇటువంటి మౌలిక వసతులే భారత్‌కు అవసరమని మరొకరు కామెంట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2019 ఫిబ్రవరి 15న దిల్లీ వారణాసి మధ్య తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన వందేభారత్ రైళ్ల సంఖ్య 150కి పెరిగింది. ఆదివారం ఒక్కరోజే ప్రధాని మోదీ మూడు కొత్త వందే భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. అమృత్‌సర్ శ్రీమాత వైష్ణోదేవి కత్రా, బెలగావి-బెంగళూరు, అజ్నిపుణె వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ఆయన స్వయంగా ప్రారంభించారు.

# ద్రవ్యోల్బణం భయాలు..

**నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**368 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్, 80,235 వద్ద ముగింపు**

**97 పాయింట్లు పడిపోయి 24,487 వద్ద స్థిరపడిన నిఫ్టీ**

**ద్రవ్యోల్బణ గణాంకాల విడుదల నేపథ్యంలో ఇన్వెస్టర్ల అమ్మకాలు**

**బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**లాభపడిన ఐటీ, ఆటో రంగాల షేర్లు**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు భారీ నష్టాలతో ముగిశాయి. అమెరికా, భారత్‌లలో జులై నెలకు సంబంధించిన ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తత పాటించారు. అంతర్జాతీయంగా టారిఫ్‌లకు సంబంధించిన ఆందోళనలు కూడా తోడవడంతో అమ్మకాలకే మొగ్గు చూపారు. ఫలితంగా రోజంతా తీవ్ర ఒడిదొడుకులకు లోనైన సూచీలు చివరికి నష్టాల్లో స్థిరపడ్డాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 368.49 పాయింట్లు (0.46 శాతం) క్షీణించి 80,235.59 వద్ద ముగిసింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 97.65 పాయింట్లు (0.40 శాతం) నష్టపోయి 24,487.40 వద్ద స్థిరపడింది. ఉదయం సెషన్ ప్రారంభం నుంచే సూచీలు ప్రతికూలంగా కదలాడాయి.

రంగాల వారీగా చూస్తే, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 467 పాయింట్లు, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీ 270 పాయింట్లు పడిపోయాయి. అయితే, దీనికి భిన్నంగా ఐటీ, ఆటో రంగాల షేర్లు లాభాలను ఆర్జించి మార్కెట్లకు కొంత మద్దతునిచ్చాయి. సెన్సెక్స్ బాస్కెట్‌లో బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ వంటి ప్రధాన షేర్లు నష్టపోగా.. మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్ ఫార్మా, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులపై జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ స్పందిస్తూ, "అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు ఫెడ్ పాలసీ వైఖరిని ప్రభావితం చేయవచ్చు. దేశీయ ద్రవ్యోల్బణం మాత్రం ఆర్‌బీఐ నిర్దేశించిన పరిధిలోనే ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో స్వల్పకాలంలో మదుపరులు దేశీయ వినియోగ ఆధారిత రంగాలపై దృష్టి పెట్టడం మంచిది" అని వివరించారు. ఇక కరెన్సీ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 87.70 వద్ద ఫ్లాట్‌గా ట్రేడ్ అయింది. ముడిచమురు ధరలు పెరగడం రూపాయిపై ఒత్తిడి పెంచుతోంది.

## బంగారం దిగుమతులపై సుంకాలు ఉండవు..

**ట్రంప్ కీలక ప్రకటన**






**న్యూయార్క్:** రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా భారత్ సహా ప్రపంచంలోని పలు దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు కారణంతో న్యూఢిల్లీపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చింది. ఆగస్టు 27 నుంచి మిగతా 25 శాతం టారిఫ్ అమలులోకి రానుంది. అయితే, ట్రంప్ నిర్ణయంతో దిగుమతి చేసుకునే బంగారు కడ్డీలపై సుంకాల పెంపు వర్తిస్తుందా? లేదా? అనే విషయంపై సందిగ్ధత నెలకొంది. దీనిపై అధ్యక్షుడు ట్రంప్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. 'బంగారం' లాంటి వార్త చెప్పారు. బంగారం దిగుమతులపై అదనపు సుంకాలు ఉండవని స్పష్టం చేశారు.

ఒక కేజీతోపాటు 100 ఔన్సుల (2.8 కిలోల) బంగారు కడ్డీలు సుంకాల పరిధిలోకి వస్తాయని అమెరికా కస్టమ్స్ అధికార వర్గాలు ఇటీవలే పేర్కొన్న విషయం తెలిసిందే. ఈమేరకు జులై 31న ఓ ప్రకటన విడుదల చేశారు. అదే సమయంలో గోల్డ్ బార్‌లపై సుంకాల విధింపుపై ట్రంప్ క్లారిటీ ఇస్తూ త్వరలోనే ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేస్తారని వైట్‌హౌస్ అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ విషయంలో గందరగోళం నెలకొంది. ఇదే సమయంలో పసిడి ధరలు కూడా అమాంతం పెరిగాయి. దీంతో ట్రంప్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు బంగారంపై సుంకాలు విధించబోమంటూ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. 'బంగారంపై సుంకాలు ఉండవు' అని రాసుకొచ్చారు.

## సామాన్యులకు పెద్ద ఊరట..

**8 సంవత్సరాలలో కనిష్ట స్థాయికి రిటైల్ ద్రవ్యోల్బణం**



**న్యూఢిల్లీ:** సామాన్యులకు పెద్ద ఉపశమనం లభించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఆహార ధరలు తగ్గడం వల్ల భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో 1.55 శాతానికి తగ్గింది. ఇది ఎనిమిది సంవత్సరాలలో కనిష్ట స్థాయి. గత ఆరు సంవత్సరాలలో ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టాలరెన్స్ బ్యాండ్ అయిన 2 శాతం నుండి 6 శాతం కంటే తక్కువగా ఉండటం ఇదే మొదటిసారి. జూన్ 2017 తర్వాత ఇది సంవత్సరానికి అత్యల్ప ద్రవ్యోల్బణ రేటు. మంగళవారం(ఆగస్టు 12) విడుదల చేసిన ప్రభుత్వ గణాంకాల ప్రకారం, జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం కూడా ఏప్రిల్‌లో 3.16 శాతం, జూలై 2024లో 3.54 శాతం నుండి తగ్గింది. 50 మంది ఆర్థికవేత్తలతో కూడిన రాయిటర్స్ సర్వే జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 1.76 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.

రిటైల్ ద్రవ్యోల్బణంలో దాదాపు సగానికి సమానమైన ఆహార ద్రవ్యోల్బణం -1.76 శాతంగా ఉంది. గత నెలలో ఇది 1.06 శాతం తగ్గుదలతో పోలిస్తే, ఇది గణనీయంగా తగ్గింది. వర్షాకాలం అసమానంగా ఉన్నప్పటికీ, వసంతకాలంలో మంచి పంటలు భారతదేశానికి ఆహార ధరలను అదుపులో ఉంచడానికి సహాయపడ్డాయి. ఇది ఒక దశాబ్దానికి పైగా దేశంలో అతి ఎక్కువ కాలం ద్రవ్యోల్బణం తగ్గడానికి దారితీసింది.

ఆర్‌బిఐ ద్రవ్య విధాన కమిటీ రేట్లను 5.50 శాతం వద్దనే ఉంచి, ద్రవ్యోల్బణ అంచనాను మరింత అనుకూలంగా పేర్కొన్న దాదాపు వారం తర్వాత ఈ గణాంకాలు వెలువడ్డాయి. ఫిబ్రవరి నుండి వరుసగా మూడు రేటు కోతల తర్వాత ఈ విరామం వచ్చింది. ఈ కాలంలో, ఆర్‌బిఐ రెపో రేట్లను 1 శాతం తగ్గించింది. కమిటీ ఇప్పటివరకు తన వైఖరిని తటస్థంగా ఉంచుకుంది. ఇంధనం, విద్యుత్ ధరలు జూన్‌లో 2.55 శాతం నుండి జూలైలో 2.67 శాతానికి పెరిగాయి. ఇటీవల, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై 50 శాతం సుంకం విధించారు. ఇందులో 25 శాతం సుంకం అమలు చేశారు. ఆగస్టు చివరి వారంలో 25 శాతం సుంకం విధించారు. అటువంటి పరిస్థితిలో, వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పు చేయకూడదనే ఆర్‌బిఐ నిర్ణయం ఆర్థిక వ్యవస్థను పెంచుతుంది.

# కెప్టెన్‌గా తొలి ఐసీసీ అవార్డు..

**నాలుగోసారి 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా గిల్..**

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ పర్యటనలో దంచికొట్టిన శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా తొలి ఐసీసీ అవార్డు అందుకున్నాడు. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో సారథిగా జట్టును ముందుండి నడిపించిన గిల్.. ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా ఎంపికయ్యాడు. జూలై నెలకుగానూ అతడు ఈ అవార్డును కైవసం చేసుకున్నాడు.



ఇంగ్లండ్ గడ్డపై పరుగులు వరద పారించిన అతడు ఆ జట్టు నాయకుడు బెన్ స్టోక్స్, దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ మల్డర్ కంటే అత్యధిక ఓట్లతో విజేతగా నిలిచాడు. విశేషం ఏంటంటే.. గిల ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు గెలుపొందం ఇది నాలుగోసారి. పురుషుల క్రికెట్‌లో మరెవరూ ఇన్నిసార్లు ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు అందుకోలేదు.

### ఈ అవార్డు ఎంతో ప్రత్యేకం

'జూలై నెలకు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఎంపికవ్వడం గొప్పగా అనిపిస్తోంది. టెస్టు కెప్టెన్‌గా అద్భుత బ్యాటింగ్ ప్రదర్శన చేసినందుకు ఈ అవార్డు రావడం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. ఇంగ్లండ్ పర్యటనలో బర్మింగ్‌హమ్‌లో సాధించిన ద్విశతకాన్ని నేను కలకాలం గుర్తించుకుంటాను' అని గిల్ వెల్లడించాడు. సీనియర్ల గైర్హాజరీలో టెస్టు జట్టు పగ్గాలు అందుకున్న గిల్ తొలి సిరీస్‌లోనూ తన తడాఖా చూపించాడు. ఒక డబుల్ సెంచరీ, రెండు సెంచరీలతో కలిపి 754 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుపొందాడీ స్టార్ ప్లేయర్. 2023 జనవరిలో గత రెండేళ్ల నుంచి భీకర ఫామ్‌లో ఉన్న గిల్.. తొలిసారి 2023 జనవరిలో ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు గెలిచాడు. అదే ఏడాది సెప్టెంబర్‌లోనూ తన బ్యాట్ పవర్ చూపించిన ఈ యువకెరటం మరోసారి విజేతగా నిలిచాడు. 2025 ఫిబ్రవరిలోనూ నామినేట్ అయిన గిల్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు తన్నుకుపోయాడు. తొలి మూడు పర్యాయాలు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో విజేతగా అవతరించిన ఈ డాషింగ్ బ్యాటర్.. ఈసారి టెస్టు క్రికెట్‌లోనూ తనకు తిరుగులేదని చాటాడు.




# బ్రెవిస్ అజేయ శతకం..

**ఆస్ట్రేలియాపై రికార్డు స్కోర్ బాదిన సఫారీలు**

**సిడ్నీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రి పొట్టి క్రికెట్‌లోనూ రికార్డులు తిరగరాస్తోంది. లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియాను చిత్తు చేసి తొలిసారి ఐసీసీ టైటిల్ గెలుపొందిన సఫారీ టీమ్ ఈసారి ఆసీస్‌పైనే రికార్డు స్కోర్ బాదింది. టీ20ల చరిత్రలో అత్యధిక స్కోర్ నమోదు చేసింది మర్‌క్రమ్ బృందం. యువకెరటం డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసక శతకంతో చెలరేగగా 218 పరుగులు చేసింది ప్రొటీస్ టీమ్. గతంలో కంగారూ జట్టుపై 204 అత్యధికంగా ఉండేది. డార్విన్ మైదానంలో మంగళవారం జూనియర్ డివిలియర్స్ వీరకొట్టుడు కొట్టడంతో 9 ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ఈ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది.




ఈ రోజుల్లో పొట్టి క్రికెట్‌లో రెండొందలు కొట్టడం సాధారణం అయిపోయింది. ప్రతి సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనైనా 200 ప్లస్ స్కోర్ నమోదవుతోంది. డబ్ల్యూటీసీ ఛాంపియన్ దక్షిణాఫ్రికా ఈసారి విధ్వంసక ఆటతో 218 రన్స్ బాదింది. బలమైన బౌలింగ్ లైనప్ కలిగిన ఆస్ట్రేలియాపై డెవాల్డ్ బ్రెవిస్ (125 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడడంతో కొండంత స్కోర్ చేసింది.

దిగ్గజ బ్యాటర్ డివిలియర్స్‌ను తలపడించే ఆటతో ఈ యంగ్‌స్టర్ 56 బంతుల్లోనే 12 ఫోర్లు, 8 సిక్సర్లతో శతకగర్జన చేశాడు. ట్రిస్టన్ స్టబ్స్(31) మెరుపులు తోడవ్వడంతో ప్రొటీస్ జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి భారీ స్కోర్ చేసింది. గతంలో రెండు పర్యాయాలు కంగారూలపై రెండొందలు కొట్టింది దక్షిణాఫ్రికా. 2016లో జొహన్నెస్‌బర్గ్ మైదానంలో 204 -7, ఇదే గ్రౌండ్‌లో 2006లో 201-4 స్కోర్ బాదింది సఫారీ టీమ్.

# 8 ఏండ్లుగా డేటింగ్..

**ప్రేయసితో నిశ్చితార్థం చేసుకున్న క్రిస్టియానో రొనాల్డో**

**న్యూయార్క్:** దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నాడు. తన చిరకాల ప్రేయసి జార్జినా రోడ్రిగ్జ్‌తో కలిసి ఏడడగులు వేయబోతున్నాడు. గత ఎనిమిదేళ్లుగా డేటింగ్‌లో ఉన్న వీరు తాజాగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ విషయాన్ని జార్జినా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా అభిమానులతో పంచుకుంది. రొనాల్డో జార్జినాకు నిశ్చితార్థం ఉంగరం తొడగగా, దాన్ని చూపిస్తూ "అవును, నేను ఒప్పుకుంటున్నాను. ఈ జన్మలోనూ, నా ప్రతి జన్మలోనూ అతడితోనే ఉండాలని అంటూ జార్జినా రాసుకొచ్చింది". రొనాల్డో, జార్జినా 2016లో మాడ్రిడ్‌లో కలుసుకోగా.. అప్పటినుంచి వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు అనౌన్స్ చేశారు. ఈ జంటకు ఐదుగురు పిల్లలు ఉండగా.. అందులో ఇద్దరు జార్జినాకు జన్మించారు.






మరోవైపు వీరి ఎంగేజ్‌మెంట్‌లో క్రిస్టియానో జార్జినాకి ఇచ్చిన ఉంగరం ధర ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఉంగరం ధర గురించి ఇప్పటికి అనేక వార్తలు వస్తుండగా.. ఈ రింగ్ ధర సుమారు 2 మిలియన్ల నుండి 5 మిలియన్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 16.8 కోట్ల నుంచి రూ. 42 కోట్లు) వరకు ఉండవచ్చని తెలుస్తోంది.

# 100 కోట్ల పరువునష్టం కేసు..

**హైకోర్టులో వాదనలు వినిపించనున్న ధోనీ..!**

**చెన్నై:** భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ వయసు పైబడుతున్నా ఐపీఎల్‌లోనూ అభిమానులను అలరిస్తూనే ఉన్నాడు. మిస్టర్ కూల్ సారథిగా కోట్లాది మంది అభిమానులన్ని సంపాదించుకున్న మహీ భాయ్ తనపై బురదజల్లే వాళ్లను మాత్రం వదిలిపెట్టడు. పదేళ్ల క్రితం తన పరువును దెబ్బతీసేలా వ్యవహరించినందుకు ధోనీ మీడియా సంస్థపై కోర్టులో పరువు నష్టం కేసు వేశాడు. ఇప్పుడీ కేసు విచారణ జరుగనున్న నేపథ్యంలో ధోనీ కోర్టుకు వెళ్లి తన స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్నాడు.

పదేళ్ల క్రితం ఉద్దేశపూర్వకంగా తన ప్రతిష్టకు భంగం కలిగించిన ఒక మీడియా సంస్థపై, కొందరు జర్నలిస్ట్‌లపై కేసు వేసిన తాలా.. 100 కోట్లు డిమాండ్ చేశాడు. అయితే.. ఈ కేసు కొన్నిరోజులు పెండింగ్‌లో ఉంది. ఈమధ్యే మద్రాస్ హైకోర్టు దీన్ని పరిష్కరించేదిశగా చర్యలు చేపట్టింది.






### ఇంతకూ కేసు ఏంటంటే..?

ఐపీఎల్‌లో 2013 సంవత్సరం 'స్పాట్ ఫిక్సింగ్' కలకలం సృష్టించించింది. చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లపై రెండేళ్ల (2016, 2017) నిషేధం విధించింది బీసీసీఐ. అప్పుడు ఒక టీవీ డిబేట్‌లో కొందరు జర్నలిస్ట్‌లు అప్పుడు సీఎస్కే సారథిగా ఉన్న ధోనీకి ఫిక్సింగ్‌లో ప్రమేయం ఉందని కామెంట్లు చేశారు. దాంతో.. తన తప్పేమీ లేకున్నా తన పరువును దెబ్బతీయాలనే ఉద్దేశంతో సదరు మీడియా సంస్థ చేసిన కల్పిత వ్యాఖ్యల్ని ధోనీ ఖండించాడు. అంతటితో ఊరుకోకుండా పరువునష్టం కేసు కింద తనకు రూ.100 కోట్లు చెల్లించాలని 2014లో కోర్టును ఆశ్రయించాడు మహీ భాయ్. అప్పటి నుంచి ఈ కేసు పెండింగ్‌లోనే ఉంది.

తాజాగా మద్రాస్ హై కోర్టుకు చెందిన జస్టిస్ సీ.వీ.కార్తికేయన్ ఆదేశాలతో ధోనీ పెట్టిన పరువు నష్టం కేసులో పురోగతి కనిపించేలా ఉంది. ఈక్రమంలోనే ధోనీని కోర్టులో హాజరై తన వాదనలు వినిపించాల్సిందిగా ధర్మాసనం ఆదేశించింది. ఈ ఏడాది అక్టోబర్ 20, డిసెంబర్ 10వ తేదీల్లో ధోనీ తన స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సిందిగా కోర్టు వెల్లడించింది.

### ముగ్గురి అరెస్ట్

స్పాట్ ఫిక్సింగ్ కేసులో అప్పటి బీసీసీఐ అధ్యక్షుడు ఎన్ శ్రీనివాసన్ అతడి అల్లుడు గురునాథ్ మీయప్పన్, రాజస్థాన్ ఫ్రాంచైజీ సహ యజమాని రాజ్ కుంద్రాలు విచారణ ఎదుర్కొన్నారు. బుకీలతో మాట్లాడినందుకు రాజస్థాన్ జట్టులోని శ్రీశాంత్, అంకిత్ చవాన్, అజిత్ చండీలాలు అరెస్ట్ అయ్యారు. ఫిక్సింగ్ ఆరోపణలతో సీఎస్కేపై రెండేళ్ల నిషేధం కారణంగా ధోనీ రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ జట్టుకు మారాల్సి వచ్చింది.



# ఆ సినిమా అంత కంఫర్ట్‌గా అనిపించలేదు..

## ఓ ఛాలెంజ్‌లా తీసుకున్నా: అనుపమ

టాకీస్: అనుపమ పరమేశ్వరన్.. తెలుగు సినీప్రియులకు ఎంతో ఇష్టమైన హీరోయిన్. ముఖ్యంగా కుర్రాళ్ల ఆరాధ్య దేవత. టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుస సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది ఈ కేరళ చిన్నది. ఇప్పుడు పరదా మూవీతో అడియన్స్ ముందుకు రాబోతుంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉంటుంది. అనుపమ పరమేశ్వరన్.. ప్రత్యేకంగా పరిచయం అవసరంలేని హీరోయిన్. ప్రేమమ్ సినిమాతో మలయాళంలో నటిగా సినీప్రయాణం స్టార్ట్ చేసిన ఈ అమ్మడు.. ఎక్కువగా తెలుగులోనే సినిమాలు చేసింది. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరించింది. అంతేకాదు.. ఈ అమ్మడు ఎక్కువగా హెూమ్లీ పాత్రలతోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. పెద్దగా గ్లామర్ షో చేయకుండా కర్లీ హెయిర్.. చూడచక్కని అందం.. సహజ నటనతో జనాలను కట్టిపడేసింది. కానీ కెరీర్ మొత్తంలో మొదటిసారి టిల్లు స్క్వేర్ సినిమతోత తనలోని కొత్త యాంగిల్ పరిచయం చేసింది. ఇందులో గ్లామరస్ పాత్రలో.. స్కర్ట్స్ వేసుకుని.. లిప్ లాక్ సీన్లలో కనిపించేసరికి అభిమానులు షాకయ్యారు. అనుపమ ఇలాంటి పాత్రలో కనిపించడమేంటీ అని ఆశ్చర్యపోయారు. తాజాగా ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చింది అనుపమ. ఆమె నటించిన పరదా ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. టిల్లు స్క్వేర్ సినిమా సమయంలో తాను అంతగా కంఫర్ట్ లేరన్న విషయాన్ని బయటపెట్టింది. తన అభిమానులకు అలాంటి పాత్ర చేయడం నచ్చలేదని.. ఆ సినిమాలో చేసిన క్యారెక్టర్ ఒప్పుకోవడానికి చాలా టైమ్ పట్టిందని.. చెయ్యాలా వద్దా అని చాలాసార్లు ఆలోచించానని తెలిపింది. సెట్ కు వెళ్లి 100 శాతం కాన్ఫిడెంట్ గా లేకుండా చేసిన సినిమా అది.. కానీ సినిమాలో గానీ.. ప్రమోషన్లలో గానీ ఆ డ్రెస్సులు వేసుకోవడం అంతగా కంఫర్ట్ గా అనిపించలేదు. వేర్వేరు సినిమాల్లో చేసినట్లే ఇది ఓ ఛాలెంజ్ లా అనిపించింది. ఆ పాత్ర చాలా బలమైనదని భావించాను. సినిమా రిలీజ్ అయ్యాక కూడా హీరోకు సమానంగా ఉ ఒదని అన్నారు అంటూ చెప్పుకొచ్చింది.




# కేరళ కుట్టిగా జాన్వీ పరమ్ సుందరి

**టాకీస్:** సిద్ధార్థ్ మల్హోత్రా , జాన్వీ కపూర్ జంటగా తెరకెక్కిన సినిమా 'పరమ్ సుందరి' తుషార్ జలోటా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఇందులో.. సౌత్ ఇండియన్ టాప్ హీరోలు రజనీకాంత్, మోహన్‌లాల్, అల్లు అర్జున్‌లాంటి వారిని ఇమిటేట్ చేసి జాన్వీ అలరించారు. కేరళ అమ్మాయిగా జాన్వీ, ఢిల్లీ అబ్బాయిగా సిద్ధార్థ్ సందడి చేశారు.

# అజయ్ దేవ్‌గన్ పిలిస్తేనే వచ్చాడు..

## ధనుష్‌తో రిలేషన్‌షిప్ వార్తలపై మృణాళ్ ఠాకూర్

టాకీస్: తెలుగు, తమిళంతోపాటు హిందీ భాషల్లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న స్టార్ యాక్టర్ల జాబితాలో టాప్‌లో ఉంటారు మృణాళ్ ఠాకూర్, ధనుష్. ఈ ఇద్దరు ప్రస్తుతం తమ తమ సినిమాలతో బిజీగా ఉన్నారని తెలిసిందే. అయితే ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ కొన్ని రోజులుగా నెట్టింట పుకార్లు షికారు చేస్తున్నాయి. కొందరు సోషల్ మీడియా యూజర్లు ఏకంగా





మృణాళ్ ఠాకూర్ మ్యూజిక్ ప్లేలిస్టును వీరిద్దరి లిలేషన్‌షిప్‌కు సాక్ష్యంగా చూపిస్తూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ వార్తలపై ఫైనల్‌గా మృణాళ్ ఠాకూర్ స్పందించింది. కోలీవుడ్ మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో డేటింగ్ వార్తలపై స్పష్టత ఇచ్చింది. తనపై వస్తున్న పుకార్ల గురించి తెలుసునన్న మృణాళ్ ఠాకూర్.. ఆ పుకార్లు చాలా ఎంటర్‌టైనింగ్‌గా, నవ్వొచ్చేలా ఉన్నాయని చెప్పింది. 'మేమిద్దరం స్నేహితులం. ధనుష్ నాకు మంచి స్నేహితుడు. కేవలం అజయ్ దేవ్‌గన్ ఆహ్వానించడం వల్లే సన్నాఫ్ సర్దార్ 2 ఈవెంట్‌లో పాల్గొన్నాడని.. ధనుష్‌కు తాను ఇన్విటేషన్‌ను పంపలేదని స్పష్టం చేసింది మృణాళ్ ఠాకూర్. ఎవరూ కూడా ఆ విషయాన్ని అపార్థం చేసుకోవద్దని' చెప్పింది.

ఈ కామెంట్స్‌తో ఇద్దరి మధ్య ఎలాంటి రిలేషన్‌షిప్ లేదని క్లారిటీ ఇచ్చేసింది మృణాళ్ ఠాకూర్. మృణాళ్ ఠాకూర్ ప్రస్తుతం తెలుగు, హిందీ బైలింగ్వువల్ ప్రాజెక్ట్ డెకాయిట్ సినిమాలో నటిస్తోంది. దీంతోపాటు హిందీలో మూడు సినిమాలు, తెలుగులో మరో మూవీ చేస్తోంది. ఇటీవలే కుబేర సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ధనుష్.. ప్రస్తుతం ఇడ్లీ కడైతోపాటు పలు సినిమాలను లైన్‌లో పెట్టాడు.

ధనుష్, ఆనంద్ ఎల్ రాయ్ కాంబోలో వస్తోన్న తేరే ఇష్క్ మే మూవీ షూటింగ్ ముగింపు పార్టీలో మృణాళ్‌ఠాకూర్ కనిపించడంతో మొదటిసారి ధనుష్‌తో ఈ భామ రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు వార్తలు తెరపైకి చ్చాయి. అయితే మరోసారి సన్నాఫ్ సర్దార్ 2 ఈవెంట్‌లో ధనుష్ కనిపించడంతో ఆ పుకార్లు మరోసారి హల్ చల్ చేశాయి.

# 14న విడుదలవనున్న కూలీ, వార్-2

## తెలుగు రాష్ట్రాల్లో యధావిధిగా టిక్కెట్ రేట్లు





టాకీస్: కూలీ, వార్ 2 సినిమాలకు తెలంగాణలో టికెట్ల రేట్లు పెంచబోతున్నట్లు సోమవారం సాయంత్రం నుంచి వార్తలు వైరలయ్యాయి. అయితే ఈ నిర్ణయంపై అటు- అభిమానులతో పాటు- మువీ లవర్స్ కూడా తీవ్రంగా తప్పుబట్టారు. డబ్బింగ్ సినిమాలకు కూడా టికెట్ రేట్లు పెంచి ఈ దోచుకోవడం ఏంటి అని సోషల్ మీడియాలో నిర్మాతలతో పాటు- తెలంగాణ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. దీంతో టికెట్ ధరలపై నిర్మాతలు వెనక్కి తగ్గినట్లు తెలుస్తుంది. సాధారణ టికెట్ ధరలకే ఈ సినిమా టికెట్‌లను అందుబాటులో ఉంచబోతున్నట్లు- సినీ వర్గాల సమాచారం. దీనికి సంబంధించి అప్‌డేట్ రానుంది. మరోవైపు ఈ రెండు సినిమాల బుకింగ్స్ ఓపెన్ కాబోతున్నాయి. రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న కూలీ సినిమాతో పాటు- హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో రాబోతున్న వార్ 2 చిత్రం ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. అయితే ఈ రెండు డబ్బింగ్ సినిమాలకు తెలంగాణతో పాటు- ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ రేట్లు- పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు- వార్తలు వస్తున్నాయి. కూలీ సినిమాకు తమిళనాడులో అత్యధిక టికెట్ ధర రూ.190 రూపాయలు ఉ ండగా.. తెలుగు రాష్ట్రాల్లో వచ్చేసరికి ఆ ధర దాదాపు రూ.450 నుంచి రూ.500 వరకు వెళు తుందని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హిందీ నుంచి వస్తున్న డబ్బింగ్ చిత్రం వార్ 2 కి కూడా హిందీలో రూ.250 టికెట్ రేట్లు- ఉండగా.. తెలంగాణలో రూ.400 వరకు ఉండబోతుందని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇవే రేట్లు- కొనసాగితే.. భవిష్యత్తులో ప్రేక్షకులు థియేటర్లకి రావడం మానేసి.. ఓటీటీ- లేదా.. పైరసీ వెబ్‌సైట్‌లకు అలవాటుపడతారని విశ్లేశకులు భావిస్తున్నారు.

# నిరంతరాయంగా కాంతారా-2 చిత్రీకరణ

## కొన్ని ప్రమాదాలు యాధృచ్ఛికమన్న నిర్మాత



**టాకీస్:** కన్నడ మూవీగా విడుదలై పాన్ ఇండియా స్థాయిలో ఆదరణ దక్కించుకున్న చిత్రం 'కాంతారా' ఇప్పుడు ప్రీక్వెల్‌గా రిషబ్‌శెట్టి 'కాంతారా: చాప్టర్1' రూపొందిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. 'కాంతార2' మొదలైనప్పటి నుంచి వరుస ప్రమాదాలు, షూటింగ్‌కు అడ్డంకులు తలెత్తుతున్న సంగతి తెలిసిందే. ఇదేమైనా శాపమా? అంటూ కన్నడ ఇండస్ట్రీలో టాక్ మొదలైంది. దీనిపై చిత్ర నిర్మాత చలువే గౌడ స్పందించారు. సినిమాకు ఏర్పడిన అవరోధాలపై స్పందించారు. సినిమా షూటింగ్ సందర్భంగా దురదృష్టవశాత్తూ చోటు- చేసుకున్న సంఘటనలపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. సెట్‌లో ఒకే ఒక అగ్ని ప్రమాదం జరిగింది. మిగిలినవన్నీ సినిమాకు సంబంధం లేనివని అన్నారు. 2024 నవంబరులో కర్ణాటకలోని కొల్లూరు వద్ద జరిగిన ప్రమాదంలో చిత్ర బృందం గాయాలతో బయటపడింది. అలాగే 2025 జనవరిలో సెట్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు- చేసుకుంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఆ తర్వాత ఇటీవల రిషబ్ శెట్టి సహా కొంతమంది టీమ్ సభ్యులు త్రుటిలో పడవ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కెమెరాలు, ఇతర పరికరాలు నీటిపాల య్యాయి. ము ఎక్కువగా దట్టమైన అటవీ ప్రాంతంలో చిత్రీకరణలు జరిపాం. ఉదయం 4 గంటలకు నిద్రలేచి, 4.30 కల్లా రెడీ అయి, షూటింగ్ స్పాట్‌కు వెళ్లిపోయే వాళ్లం. ఎట్టి పరిస్థితుల్లో ఉదయం 6 గంటలకు చిత్రీకరణ మొదలైపోయేది. 80 శాతం సినిమాను నిజమైన ప్రదేశాల్లోనే తెరకెక్కించాం.

# క్యూట్ లుక్స్‌తో కవ్విస్తున్న పూజిత పొన్నాడ



టాకీస్: 2016లో నాగార్జున ఊపిరి సినిమాతో కెరీర్ ప్రారంభించింది పూజిత పొన్నాడ. ఆ తర్వాత నాగార్జున ప్రేమమ్ సినిమాలో కాలేజ్ స్టూడెంట్ గా కనిపించింది. ఈ సినిమాతో ఈ చిన్నది పెద్దగా గుర్తింపు తెచ్చుకోలేదు. కానీ చుసిన వారందరూ ఈ బ్యూటీ బాగుందని పొగిడేశారు. అయితే పూజితకు బాగా గుర్తింపు తీసుకొచ్చిన సినిమా ఏదంటే రామ్ చరణ్, సుకుమార కాంబినేషన్ లో వచ్చిన రంగస్థలం అని చెప్పుకోవచ్చు. ఇందులో ఆది పినిశెట్టి ప్రియురాలు పద్మ పాత్రలో ఆమె అభినయం అందరినీ ఆకట్టుకుంది. సినిమాలో ఆమె కనిపించేది కొద్దిసేపే కానీ ఆకట్టుకుంది. రంగస్థలం సినిమా తర్వాత రాజుగాడు, బ్రాండ్ బాబు, హ్యాపీ వెడ్డింగ్, కల్కి, వేర్ ఈజ్ వెంకట లక్ష్మి, రన్, మిస్ ఇండియా, కథ కంచికి మనం ఇంటికి, ఓదెల రైల్వే స్టేషన్ తదితర సినిమాల్లో నటించింది పూజిత. ఆతర్వాతకూడా వరుస ఆఫర్స్ అందుకుంది ఈ అందాల తార. అలాగే మాస్ రాజా రవితేజ రవితేజ రావణాసుర సినిమాల్లో మరో కీలక పాత్ర పోషించింది. అయితే ఎందుకోకానీ ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మాత్రం రావడం లేదు.. హిట్స్ రాకపోయినా ఈ చిన్నదానికి ఆఫర్స్ మాత్రం ఎక్కడా తగ్గడం లేదుఇటీవలే పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమాలో పూజిత కూడా కనిపించింది. అలాగే ఓ తమిళ సినిమాలోనూ నటిస్తోందీ అందాల తార. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ భామ.. తన క్రేజీ ఫొటోలతో అభిమానులను అలరిస్తుంది. గ్లామరస్ ఫొటోలతో పాటు క్యూట్ క్యూట్ ఫోటోలను కూడా పంచుకుంది పూజిత. ఈ చిన్నదాని ఫోటోలకు కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.